

మహానంది ఆలయ ఈవో బదిలీ

మహానంది, జూన్ 27: మహానంది ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆయన్ను మాతృ సంస్థ విద్యాశాఖకు బదిలీ చేస్తూ రాష్ట్ర దేవదాయ శాఖ అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కొటప్పకొండ త్రికోటేశ్వర దేవస్థానంలో సహాయ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్. శ్రీనివాసరెడ్డిని మహానంది ఆలయ ఇన్‌చార్జి ఈవోగా నియమించారు. చంద్రశేఖర్‌రెడ్డిని దేవదాయశాఖ కమీషనర్ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.



కౌలు రైతుకు హక్కు పత్రాలు

సీసీఆర్‌సీ కార్డుల జారీ ఇలా...

నంద్యాల టౌన్, జూన్ 27 :
కౌలు రైతుకు కాలం కలిసి వస్తోంది. ఐదేళ్ల కడగండ్లు పరిష్కారమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే వ్యవసాయ రంగంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. రైతుల సంక్షేమమే ధ్యేయంగా పక్కా ప్రణాళికాబద్ధంగా చర్యలకు శ్రీకారం చుట్టింది. గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో వ్యవసాయ రంగం తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొన్న నేపథ్యంలో, రైతు సంక్షేమ పథకాలు సరిగ్గా అమలు కాక రైతుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొనడం తెలిసిందే. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రిగా రైతులు, వ్యవసాయ రంగంపై మంచి అవగాహన ఉన్న కింజారపు అచ్చెన్నాయుడు రైతులకు అండగా వడివడిగా పథకాల అమలుకు చర్యలు తీసుకుంటున్నారు. పేద రైతులకు అండగా, కౌలు రైతుల సంక్షేమమే ధ్యేయంగా కౌలు రైతు హక్కు పత్రాల జారీకి ప్రణాళిక సిద్ధమైంది.

ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ప్రారంభమైంది. దుక్కులు దున్నడం, పొలాలకు పశువుల ఎరువు తరలించడం, పొలాల్లో ఉన్న పంట వ్యర్థాలను శుభ్రం చేసుకోవడం తదితర పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. భూములు లేని రైతులు కౌలు పొలంపై ఆధారపడి ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న నేపథ్యంలో పంట పొలాల కౌలు ధరలు ఖరారు అవుతున్నాయి. కొందరు ముందస్తు కౌలు, మరికొందరు పంట దిగుబడి తర్వాత కౌలు మొత్తాలు ఇచ్చే విధంగా ఖరారు చేసుకొని వ్యవసాయ సీజన్‌కు సమాయత్తం అవుతున్నారు. ఇలాంటి కీలకమైన తరుణంలో కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలు (సీసీఆర్‌సీ కార్డులు) జారీ ప్రక్రియ ప్రారంభమైంది. సాగు హక్కు పత్రాలను కౌలు రైతులకు ఇచ్చే ప్రక్రియ సాధారణంగా ఏప్రిల్ నెలాఖరు నుంచే ప్రారంభమవుతుంది. ఎన్నికల నేపథ్యంలో ఈ ప్రక్రియకు అవరోధం ఏర్పడింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల బదిలీల నేపథ్యంలో కౌలు రైతుల పంట సాగు హక్కు పత్రాల ప్రక్రియ ఇప్పుడిప్పుడే మొదలైంది. ఈ ప్రక్రియను వేగవంతం చేసి సకాలంలో కౌలు రైతులకు అందేలా వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సీసీఆర్‌సీ కార్డుల జారీ ఇలా...

గ్రామాల్లో భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేయాలనుకున్న రైతులు పంట సాగు హక్కు పత్రాల కోసం మొదట వీఆర్‌వోకు దరఖాస్తు చేసుకోవాలి. వీఆర్‌వో క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం దరఖాస్తును గ్రామ వీఏఏకు పంపిస్తారు. వీఏఏ పరిశీలన తర్వాత మండల వ్యవసాయ అధికారి దరఖాస్తును పరిశీలించి కార్డు జారీకి మండల రెవెన్యూ అధికారి (తహసీల్దార్)కి పంపించాక సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేస్తారు. పంట సాగు హక్కు ధృవపత్రాలు మంజూరు చేయడంలో వీఆర్‌వో, వీఏఏ సమన్వయంతో జాగ్రత్తలు తీసుకుంటే భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఉండవని అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. కొత్త కౌలు రైతులకు కార్డులు జారీతో పాటు ఇప్పటికే సీసీఆర్‌సీ కార్డుల ద్వారా గత ఏడాది కౌలు భూమి చేసిన రైతులకు రెన్యెవల్ చేస్తారు.

- నంద్యాల వ్యవసాయ సబ్ డివిజన్‌లో నంద్యాల మండలంలో 1422, మహానంది మండలంలో 809, బండిఆత్మకూరు మండలంలో 1185, పాణ్యం మండలంలో 1501, గడివేముల మండలంలో 1027, బనగానపల్లె మండలంలో 1950 మొత్తం 7894 సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేయాలని నిర్ణయించారు.
- కోవెలకుంట్ల సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల మండలంలో 1020, దొర్నిపాడులో 950, ఉయ్యాలవాడలో 1570, సంజామలలో 1250, కొలిమిగుండ్లలో 250, అవుకులో 1025 మొత్తం 6065 కార్డులు మంజూరు చేయాలని నిర్ణయించారు.
- ఆళ్ళగడ్డ సబ్ డివిజన్‌లో ఆళ్ళగడ్డ మండలంలో 738, చాగలమర్రిలో 933, రుద్రవరంలో 1072, శిరివెళ్ళల్లో 1221, గోస్పాడులో 1622 మొత్తం 5586 కార్డులను మంజూరు చేయనున్నారు.
- ఆత్మకూరు సబ్ డివిజన్‌లోని ఆత్మకూరు మండలంలో 1073 కార్డులు, వెలుగోడులో 550, పాములపాడులో 750, కొత్తపల్లెలో 450 మొత్తం 2823 కార్డులు మంజూరు చేయనున్నారు.
- నందికొట్కూరు సబ్ డివిజన్‌లోని నందికొట్కూరు మండలంలో 1350 కార్డులు, మిడుతూరులో 1005, పగిడ్యాలలో 884, జూపాడుబంగ్లాలో 890 మొత్తం 4129 కార్డులను మంజూరు చేయాలని నిర్ణయించారు.
- డోన్ సబ్ డివిజన్ పరిధిలో డోన్ మండలంలో 393 కార్డులు, బేతంచెర్లలో 415, ప్యాపిలిలో 475 మొత్తం 1283 కార్డులను మంజూరు చేయనున్నారు.

- జిల్లాలో లక్ష్యం 27,780 మందికి జారీ చేయడం..
- గతేడాది కంటే 25 శాతం అదనంగా సీసీఆర్‌సీ కార్డుల జారీకి ప్రణాళిక..
- రైతుల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ అడుగులు..

కౌలు రైతులకు ఎంతో మేలు:

కౌలు రైతులకు పంటసాగు హక్కు పత్రాలతో ఎన్నో ఉపయోగాలు ఉంటాయి. భూ యజమానుల కంటే ప్రస్తుతం కౌలు రైతులే ఎక్కువగా సాగులో ఉన్నారు. వీరందరికీ సకాలంలో పంట సాగు హక్కు పత్రాలు మంజూరు చేస్తే విత్తనాల నుంచి, పంట ఉత్పత్తుల విక్రయం వరకు ప్రతి దశలో సీసీఆర్‌సీ కార్డుల ద్వారా ప్రయోజనాలు ఉంటాయి. 11 నెలల కాల వ్యవధితో కార్డులు మంజూరు అవుతాయి. వీటి ఆధారంగా కౌలు రైతులకు పంట రుణాలు, పంటల బీమా, పెట్టుబడి రాయితీ, సున్నావడ్డీ, ధాన్యం సేకరణ, సాగుకు యంత్ర పరికరాలు, రాయితీపై పచ్చి రొట్ట విత్తనాలు పొందేందుకు సులభతరం అవుతుంది.



27,780 సీసీఆర్‌సీ కార్డులు

జిల్లాలోని మొత్తం 6 వ్యవసాయ సబ్ డివిజన్‌లలో కలిపి మొత్తం 27780 సీసీఆర్‌సీ కార్డులను మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ప్రక్రియను ప్రారంభించడమే కాకుండా వేగవంతం చేసి సకాలంలో కౌలు రైతులకు అందేలా చేయాలని వ్యవసాయ శాఖ అధికార యంత్రాంగం, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో ముందుకు సాగేందుకు శ్రీకారం చుట్టారు.

గతేడాది కంటే 25 శాతం అదనంగా కార్డుల జారీకి ప్రణాళిక

నంద్యాల జిల్లాలో గత ఏడాది 22738 సీసీఆర్‌సీ కార్డులను జారీ చేశారు. 2024 -2025 వ్యవసాయ సంవత్సరానికి సంబంధించి జిల్లాలో గతేడాది కంటే దాదాపు 25 శాతం ఆధనంగా కార్డులు జారీ చేయాలని జిల్లా వ్యవసాయ అధికార యంత్రాంగం ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా 27780 కార్డులు జారీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాలోని వ్యవసాయ సబ్ డివిజన్‌ల వారిగా కౌలు రైతు హక్కు పత్రాల జారీ ప్రణాళిక ఖరారైంది.





లక్ష్యాన్ని చేరుకోవాలి

జిల్లాలో కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలను జారీ చేసేందుకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. వీఆర్‌వోలు, తహసీల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలి. కౌలు రైతులకు కూడా పంట రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- డాక్టర్ కె.శ్రీనివాసులు, కలెక్టర్, నంద్యాల

వంద రోజుల పనిదినాలు కల్పించండి: కలెక్టర్



ఉపాధి హామీ పనుల ప్రగతిపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), జూన్ 27: జాతీయ ఉపాధి హామీ పథకం కింద ప్రతి పేద కుటుంబానికి వందరోజులు పని దినాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ రామచంద్రారెడ్డిని ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఉపాధి హామీ పథకం పనుల ప్రగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకంలో వివిధ రకాల పనులను గుర్తించాలన్నారు. ఎస్టీ, ఎస్సీ కుటుంబాలకు వందశాతం పనులు కల్పించాలని ఆదేశించారు. ఈ పథకంలో ఇప్పటి వరకు జిల్లాలో 45 లక్షలకుగాను 44 లక్షలు పనిదినాలు పూర్తిచేసినట్లు పీడీ కలెక్టర్‌కు వివరించారు. పండ్ల తోటల పెంపకానికి సంబంధించి పనులు గుర్తించి ప్రతిపాదనలు సమర్పిస్తే పరిపాలన అనుమతులు మంజూరు చేస్తామని కలెక్టర్ వివరించారు. ఫారంపాండ్స్ నిర్మాణాలతో పాటు మినీ అమృత్ సరోవర్ పథకాల కింద రైతులను ప్రోత్సహించాలన్నారు.

చిరుత సంచారంపై చర్యలు



మహానందిలో ఆలయ అధికారులతో కలసి పరిశీలిస్తున్న టైగర్ ప్రాజెక్ట్ ఫీల్డ్ డైరెక్టర్ మూర్తి

మహానంది, జూన్ 27: నల్లమల అటవీ ప్రాంతంలోని మహానంది ఆలయ పరిసరాల చుట్టూ చిరుతపులి సంచారం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. టైగర్ ప్రాజెక్ట్ ఫీల్డ్ డైరెక్టర్ మూర్తి, డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్ మీనన్, మహానంది ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈఓలు ఎర్రమల్ల మధు, వెంకటేశ్వర్లు తదితరులు చిరుతపులి సంచరించిన పరిసరాలను గురువారం క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరుతపులి సంచారం ఉండటంతో భక్తులు, స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వన్యప్రాణులు సంచరించే ప్రదేశాల్లో ప్రజలు చెత్తా చెదారం వేయకూడదన్నారు. క్షేత్ర పరిధిలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని కోరారు. రాత్రి 9 గంటల్లోగా క్షేత్ర పరిసరాల్లోని వ్యాపార సముదాయాలను మూసివేయాలని ఆదేశించారు. నల్లమల అడవికి అత్యంత దగ్గర ఉన్న దేవస్థానం గోశాలను వేరే ప్రదేశానికి మార్పు చేస్తే మంచిందని టైగర్ ప్రాజెక్ట్ అధికారులు సూచించారు. దీంతో గోశాల ఫెన్సింగ్ చుట్టూ గ్రీన్‌మ్యాట్‌ను ఏర్పాటు చేయించారు. మహానంది నుంచి బోయలకుంట్ల వైపు వెళ్ళే రహదారిని రాత్రి 10 గంటల నుండి మూసివేయాలని సూచించారు. పచ్చర్ల సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. త్వరలోనే చిరుతపులిని బంధించి సుదూర ప్రాంతానికి తరలిస్తామని అటవీశాఖ అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో నంద్యాల రేంజ్ ఆఫీసర్ దినేష్‌కుమార్‌రెడ్డి, డీఆర్వోలు నాగేంద్రనాయక్, హైమావతి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాజా ప్రతాప్‌లు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా చిరుతపులి సంచారంపై భక్తులు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తూ మహానంది పరిసరప్రాంతాల్లో ఆలయ అధికారులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

మంత్రాలయం మఠం హుండీ ఆదాయం రూ.3.41 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

మంత్రాలయం, జూన్ 27: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం రూ.3,41,46,445 నగదు వచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాస రావు, వెంకటేష్ జోషి తెలిపారు. 29వ తేదీ నుంచి జూన్ 27వ తేదీ వరకు వచ్చిన హుండీ ఆదాయాన్ని మఠంలోని గురురాజాంగణ భవనంలో లెక్కింపు నిర్వహించారు. ఇందులో నగదు రూపంలో రూ.3,41,46,445 ఆదాయం సమకూరగా, 2.570 కిలోల వెండి, 82 గ్రాముల బంగారు వచ్చాయి. వీటితో పాటు వివిధ దేశాలకు చెందిన కరెన్సీ వచ్చింది. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నడుమ హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ అనంత పురాణిక్, ఆడిటర్ దత్తుస్వామి, కృష్ణమూర్తి, గిరిధర్, సుజ్ఞానేంద్ర, వాణి, గురురాజ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పింఛన్ తిప్పలు

- వృద్ధులు, దివ్యాంగులకు జూలై నుంచి ఇంటికి వచ్చి అందజేత ..
- సచివాలయ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగింత
- ఉమ్మడి జిల్లాలో 4,67,389 మంది లబ్ధిదారులు



కొలిమిగుండ్ల రూరల్, జూన్ 27: వైసీపీ ప్రభుత్వ పెద్దల కుట్రతో గత 3నెలలుగా నానా ఇబ్బందులు పడిన వృద్ధులు, వికలాంగులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. జూలై1న పింఛన్ లబ్ధిదారులకు ఇంటి వద్దనే పింఛన్ సొమ్ము అందించాలని సోమవారం మంత్రివర్గం తీర్మానించింది. సచివాలయ ఉద్యోగులకు తాత్కాలికంగా ఈ బాధ్యతలను అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొల్లు పార్థసారథి ప్రకటించారు. జూలై 1న రూ.4000+3000=7000 లబ్ధిదారులకు ఇంటి వద్దనే అందించనున్నట్లు ప్రకటించారు. దీంతో సామాజిక పింఛన్ లబ్ధిదారుల మోముల్లో చిరునవ్వులు వెల్లి విరుస్తున్నాయి. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించగానే అవ్వాతాతలు, వికలాంగుల కోసం పింఛన్ పెంపు ఫైలుపై సంతకం చేయడంతో ఆయా వర్గాల్లో పెద్ద ఎత్తున హర్షం వ్యక్తమయింది. మరో ఐదు రోజుల్లో పెరిగిన పింఛన్ సొమ్ము తమ చేతికొస్తుందన్న ఆనందంలో వారు ఉన్నారు. జూలై నెల నుండి పింఛన్ సొమ్ము వృద్ధులు, వితంతువులకు రూ.4000 వేలు, దివ్యాంగులకు రూ.6వేలు అందించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో పాటు చంద్రబాబు చెప్పిన విధంగా ఏప్రిల్ నుండే అమలులోకి వచ్చేలా గత మూడు నెలల రూ.1000 కలిపి రూ.7వేలు జూలై 1న ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందించనున్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర పింఛన్ లబ్ధిదారులు నంద్యాల జిల్లాలో 2,21,702 వుండగా, కర్నూలు జిల్లాలో 2,45,687 వున్నారు. వీరందరికీ జూలై 1న రూ.351 కోట్ల పింఛన్ సొమ్ము పంపిణీ చేయనున్నారు.

పింఛన్ పెంచడం ఆనందంగా వుంది



తెలుగుదేశం ప్రభుత్వం పింఛన్ పెంచడం సంతోషంగా ఉంది. నేను ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేకుండా, వచ్చిన పింఛన్‌తోనే జీవించవచ్చు.

-నరసమ్మ, వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారు

దివ్యాంగుల పాలిట దేవుడు చంద్రబాబు



దివ్యాంగులపట్ల చంద్రబాబు దేవుడు. మాకు రూ.3000 ఉన్న పింఛన్ రూ. 6000 పెంచడం జీవితంలో మరిచిపోలేని విషయం. ఆయనకు ఎల్లప్పుడూ రుణపడి వుంటాం.

-దూదేకుల దస్తగిరి, దివ్యాంగ పింఛన్ లబ్ధిదారుడు

తలెత్తుకొని జీవించేలా చేశారు



సీఎం చంద్రబాబు పింఛన్ పెంపుతో వృద్ధులు, వికలాంగులు తమ కుటుంబంలో, సమాజంలో తలెత్తుకొని జీవించేలా చేశారు. పెంచిన సొమ్ముతో వారి కుటుంబం ఇబ్బందులు లేకుండా గడవడానికి వీలు ఏర్పడింది.

- అబ్దుల్ ఖాదర్, పింఛన్ లబ్ధిదారుడు, పెట్నికోట

పింఛన్ల పెంపు చారిత్రాత్మక నిర్ణయం:

జీవితం చివరి దశలో వుండి, కుటుంబ సభ్యుల ఆదరణకు నోచుకోని లక్షలాది మంది లబ్ధిదారులకు సంబంధించిన సామాజిక పింఛన్ పెంపు చారిత్రాత్మక నిర్ణయమని పలువురు విశ్లేషకులు పేర్కొంటున్నారు. పింఛన్ లబ్ధిదారుల పట్ల ముందు నుండి పెద్ద మనస్సుతో వ్యవహరిస్తున్నది చంద్రబాబేనని పలువురు పేర్కొంటున్నారు. రూ.1000వున్న సామాజిక పింఛన్ సొమ్మును 2014 నూతన ఆంధ్రప్రదేశ్‌లో అధికారం చేపట్టిన చంద్రదబాబు రూ.2000 చేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఆ తర్వాత 2019లో అధికారం చేపట్టిన వైసీపీ విడతల వారిగా పెంపు అంటూ 2024 ఎన్నికల ముందు రూ.3000 చేసింది. అయితే ప్రస్తుతం దాన్ని రూ.4000 వేలు చేస్తూ చంద్రన్న తన పెద్ద మనస్సును చాటుకున్నారు. రూ.3000గా వున్న దివ్యాంగుల పింఛన్ రూ.6000 చేసి, చంద్రబాబు సమాజంలో వారికి గౌరవాన్ని పెంచారు. దివ్యాంగుల పింఛన్‌కు సంబంధించి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జూన్ నెల వరకు రూ.16.75 కోట్లు పంపిణీ చేస్తుండగా, ప్రస్తుతం ఆ మొత్తం రూ.33.50 కోట్లకు పెరిగింది.

పక్కాగా చెప్పారు ప్రైజ్ కొట్టారు..!

కర్నూలు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఏ నియోజకవర్గంలో ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తారు..? రాష్ట్రంలో టీడీపీ కూటమికి.. వైసీపీకి ఎన్నెన్ని సీట్లు వస్తాయి..? జనం నాడి తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' అంటూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎవరికి ఎన్ని సీట్లు వస్తాయో అంచనా వేసి చెప్పాలంటూ పాఠకులను కోరింది. వారానికి రెండు కూపన్లు ప్రచురించింది. ఆంధ్రజ్యోతి పాఠకుల నుంచి విశేష స్పందన లభించింది. వేలాది కూపన్లు రాగా.. రాష్ట్ర స్థాయిలో ఆంధ్రజ్యోతి పాఠకులు ఏకంగా 13 మంది టీడీపీ కూటమికి 164 సీట్లు వస్తాయని, వైసీపీ కేవలం 11 స్థానాలు వస్తాయని ఎగ్జిట్ పోల్స్ కంటే ముందే కచ్చితమైన అంచనా వేశారు. అందులో కర్నూలు జిల్లా నుంచి ఇద్దరు పాఠకులు పక్కా అంచనాతో కూపన్ల పంపారు. ఆ 13 మంది కూపన్లను డ్రా తీస్తే కర్నూలు నగరం బళ్లారి చౌరస్తా సమీపంలో నివాసం ఉంటున్న ఎస్.మహేశ్వరి, గిడ్డయ్య దంపతులు రెండో స్థానంలో నిలిచి రూ.50 వేలు బంపర్ ప్రైజ్ అందుకున్నారు. ఆ ప్రైజ్ చెక్కును గురువారం ఆంధ్రజ్యోతి కర్నూలు యూనిట్ మేనేజర్ ఎ. లక్ష్మన్, ఎడిషన్ ఇన్‌చార్జి చల్లా నవీన్ కుమార్ నాయుడు, బ్యూరో ఇన్‌చార్జి జి. కొండప్ప, సర్క్యులేషన్ మేనేజర్ జి. సోమశేఖర్‌రెడ్డి, ఏబీఎన్ స్టాఫ్ రిపోర్టరు సుంకన్న తదితరులు వారికి అందజేశారు.

- 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' విజేతకు నగదు ప్రోత్సాహకం



విజేత మహేశ్వరి కుటుంబం



విజేతకు చెక్కును అందజేస్తున్న ఆంధ్రజ్యోతి సిబ్బంది

తెలిసినవాళ్లకు చెబితే హేళన చేశారు

మాకు రోజు పేపర్ చదవడం అలవాటు. టీవీల్లో న్యూస్ ఛానల్స్ నిరంతరం చూస్తుంటాం. ప్రజలను ఎవరికి అడిగినా టీడీపీ కూటమి విజయం సాధిస్తుదనే చెప్పారు. అందుకే రాష్ట్రంలో కూటమి 164 సీట్లు, వైసీపీకి 11 సీట్లకు మించి రావని అంచనా వేశాం. అదే సంఖ్య ఆంధ్రజ్యోతి కూపన్‌లో నింపి పంపాం. మా మిత్రులు, తెలిసిన వాళ్లతో ముందే చెబితే నమ్మకపోగా హేళన చేశారు. చివరికి మా అంచనాలే కరెక్ట్ అయ్యాయి. రాష్ట్ర స్థాయిలో రెండో బహుమతి రావడం ఆనందంగా ఉంది.

-విజేత దంపతులు మహేశ్వరి, గిడ్డయ్య

కష్టాలను అధిగమించి కలెక్టర్ దాకా..!

- స్ఫూర్తిదాయకం కలెక్టర్ రంజిత్ బాషా ప్రస్థానం
- నేడు కర్నూలులో బాధ్యతల స్వీకరణ



కలెక్టరు పి.రంజిత్‌భాషా

కర్నూలు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఎవరూ పేదరికంతో పుట్టరు.. ఆ పేదరికంపై విజయం సాధించి సగర్వంగా నిలిస్తేనే జన్మ సార్థకత అవుతుంది. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని, కష్టాలను ధైర్యంగా ఎదుర్కొని అత్యున్నత స్థానానికి చేరుకున్నారు. ఐఏఎస్ అధికారి రంజిత్ బాషా చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి కలల సాకారం కోసం అహోరాత్రులు కష్టపడి నేడు కర్నూలు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టబోతున్నారు పి.రంజిత్ బాషా. ఈ నెల 22న రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు జిల్లా కలెక్టర్‌గా రంజిబాషాను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బాపట్ల కలెక్టరుగా పని చేస్తున్న ఆయన్ను ఇక్కడికి బదిలీ చేసింది. శుక్రవారం ఉదయం 10:15 గంటలకు కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో బాధ్యతలు తీసుకోనున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి ఆయన్ను పలకరించగా జన్మభూమి గడ్డపై కలెక్టర్‌గా పని చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని ఆయన వివరించారు.

నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణానికి చెందిన హలీమాబీ, గోకారి సాహెబ్ దంపతులు సంతానం పి.రంజిత్‌భాషా. 1975 ఆగస్టు 31న జన్మించారు. సామాన్య కుటుంబంలో పుట్టిన ఆయన చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయారు. ఆలనపాలన అమ్మ హలీమాబీపై పడింది. కొడుకును ఉన్నతంగా చూడాలనే సంకల్పంతో హలీమాబీ కుమారుడు రంజిత్‌భాషాను నందికొట్కూరు పట్టణం సంతపేటలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చేర్పించింది. 7వ తరగతి వరకు ఆ బడిలోనే చదుకున్నారు. ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గలో ఉన్న ఏపీ గురుకుల పాఠశాలలో సీటు రావడంతో 8వ తరగతిలో చేరారు. 10వ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. నందికొట్కూరులోని ప్రభుత్వ కళాశాల్లో ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. అమ్మ హలీమాబీ ప్రోత్సాహంతో అనంతపురం జిల్లాలోనే ఎస్కే యూనివర్సిటీలో ఎమ్మెస్సీ మాథ్స్, సిక్కిం మణిపాల్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశారు. ఓ వైపు ఉన్నత చదువులు కొనసాగిస్తూనే.. మరో వైపు 2003లో గ్రూప్-1 నోటిఫికేషన్ రావడంతో ఎలాగైనా ర్యాంక్ సాధించాలనే పట్టుదలతో సాధన చేశారు. అనుకున్న లక్ష్యంగా దిశగా అడులు వేశారు. రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంక్ సాధించి డిప్యూటీ కలెక్టరుగా 2007లో ఎంపికయ్యారు. 2018 ఫిబ్రవరిలో ఐఏఎస్‌గా పదోన్నతి పొందారు. అమ్మ హలీమాబీ కలలు సాకారమైన రోజు అది. అందుకే అమ్మ అంటే ఆయనకు ఎంతో ప్రేమ.

కంప్యూటర్ కోర్సులో ఎమ్మెస్సీ చేసిన రంజిత్‌భాషాకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవడంలో ఆయన దిట్ట. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పలు సాఫ్ట్‌వేర్లు రూపకల్పనలో ప్రశంసలు అందుకున్నారు. గ్రూప్-1 ఆఫీసర్‌గా ఎంపిక కాకమునుపు పోస్టల్ శాఖలో పని చేసే సమయంలో ఆ శాఖకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ తయారు చేసి ఆ శాఖ రాష్ట్ర పోస్టుమాస్టర్ జనరల్ నుంచి అవార్డు అందుకున్నారు. ఈ తరువాత రాష్ట్ర ప్రభుత్వం సేవల్లోకి

సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో దిట్ట

వచ్చాక వ్యవసాయ, రెవెన్యూ శాఖ సమగ్ర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు వీలుగా ఈ-క్రాప్ పోర్టర్‌ను తయారు చేశారు. మీ-సేవా కేంద్రాల ద్వారా ప్రజలకు 64 సేవలు అందించేందుకు వీలుగా రెవెన్యూ సేవలతో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించి ప్రశంసలు అందుకున్నారు. ఈ నేపథ్యంలో కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ పూర్తి చేయడంతో పాటు సీఎం చంద్రబాబును ఒప్పించి గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణానికి అంకురార్పణ జరిగేలా కృషి చేయాలని జిల్లా రైతులు, మేధావులు ఆకాంక్షిస్తున్నారు.

కడప ఆర్డీఓగా ఉద్యోగ ప్రస్థానం

ఉమ్మడి రాష్ట్రంలో 2007లో గ్రూప్-1 ఆఫీసరుగా ఎంపికైన రంజిత్‌భాషా తొలుత కడప ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టి ఉద్యోగ ప్రస్థానం మొదలు పెట్టారు. ఆ రోజు అమ్మ ఆనందం అక్షరాలకు అందనిది అంటున్నారు. ఆ తర్వాత గుడివాడ ఆర్డీఓగా, సీపీఎల్ఏ పీడీసీ ఎమ్మార్వోగా విధులు నిర్వర్తించారు. 2018లో ఆనాటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేశ్ వద్ద ఓఎస్డీగా పని చేశారు. ఆ సమయంలో అప్పటి సీఎం చంద్రబాబు ప్రభుత్వం ఐఏఎస్ పదోన్నతి కల్పించారు. విజయవాడ నగరపాలిక కమిషనర్‌గా, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి డైరెక్టరుగా, నెల్లూరు జేసీగా, కృష్ణా జిల్లా కలెక్టరుగా పని చేశారు. ప్రస్తుతం బాపట్ల కలెక్టరుగా పని చేస్తూ కర్నూలు కలెక్టరుగా బదిలీపై వస్తున్నారు. 2005లో ఈయనకు భానుతో వివాహమైంది. ఆమె కూడా ఎంఏ బీఈడీ చేశారు. వీరికి బీటెక్ చదువుతున్న లతిష్, ఇంటర్ చదువుతున్న హనీషా సంతానం.



అమ్మ హలీమాబీ, కుటుంబ సభ్యులతో కలెక్టరు రంజిత్‌భాషా

లాసెట్‌లో సత్తా చాటిన హర్షశ్రీ

రాష్ట్ర స్థాయిలో 9వ ర్యాంకు



హర్షశ్రీ

నంద్యాల (నూనెపల్లె), జూన్ 27: రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన లాసెట్ ఫలితాల్లో నంద్యాల పట్టణానికి చెందిన గురు హర్షశ్రీ రాష్ట్ర స్థాయిలో 9వ ర్యాంకు సాధించి సత్తా చాటింది. నంద్యాలలోని ఎన్జీఓ కాలనీకి చెందిన తొమ్మండ్రు గురు ప్రసాద్ ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా ఉన్నారు. ఆయన సతీమణి మంజుల స్థానికంగా ఇంగ్లీష్ సబ్జెక్టులో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. వీరి కుమార్తె హర్షశ్రీ గురువారం విడుదలైన లాసెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 9వ స్థానంలో నిలిచింది. కాగా ఇంటర్మీడియట్ ఎంపీసీలో 991 మార్కులు సాధించి తెలంగాణ రాష్ట్రంలో మూడవ స్థానంలో నిలిచింది. గత ఏడాది పంజాబ్‌లోని పటియాలలో జరిగిన ఎన్‌సీసీ నేషనల్ క్యాంపులో పాల్గొని 'బీ' సర్టిఫికెట్ కైవసం చేసుకుంది. అదేవిధంగా తెలంగాణ లాసెట్‌లోనూ హర్షశ్రీ 71వ ర్యాంకు సాధించడం విశేషం. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయ విద్యను పూర్తి చేసి కక్షిదారులకు న్యాయసేవ అందిస్తానన్నారు.

రాక్ గార్డెన్‌లో సినిమా షూటింగ్

- భారీగా తరలివచ్చిన బాలయ్య అభిమానులు
- పోలీసుల భారీ బందోబస్తు



రాక్‌గార్డెన్‌లో సన్నివేశాల దృశ్యం

ఓర్వకల్లు, జూన్ 27: మండలంలోని ఓర్వకల్లు సమీపంలో ఉన్న రాక్‌గార్డెన్ (రాతి వనాలు)లో గురువారం సినిమా షూటింగ్ నిర్వహించారు. సితార ఎంటర్‌ప్రైజస్ ఆధ్వర్యంలో మహేష్‌బాబు నిర్మాతగా బాబి దర్శకత్వంలో హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో నందమూరి బాలకృష్ణ హీరోగా, హీరోయిన్లుగా ప్రజ్ఞాజైశ్వాల్‌లు రాతివనాలలో సినీ సన్నివేశాలు చిత్రీకరించారు. ఎన్‌బీకే 109 పేరుతో చిత్రీకరిస్తున్న సినిమా రాక్‌గార్డెన్‌లో మరో రెండు రోజుల పాటు సన్నివేశాలు కొనసాగుతాయి. సినిమా షూటింగ్‌ను చూసేందుకు బాలకృష్ణ అభిమానులు, టీడీపీ అభిమానులు భారీగా తరలివచ్చారు. అయితే చిత్ర యూనిట్ షూటింగ్ ప్రదేశంలోకి ఎవరినీ అనుమతించలేదు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, నాయకులు తుగ్గలి నాగేంద్ర బాలకృష్ణను కలిశారు. రాతివనాల్లో గన్‌ఫైర్లు, గుర్రాల స్వారీ వాటితో పాటు ఆసక్తికర సన్నివేశాలను చిత్రీకరించారు. ఇదిలా ఉండగా గతంలో కూడా ఈ ప్రాంతంలో జయం మనేదేరా, టక్కరిదొంగ, ఆది, శంభో శివ శంభో, సుభాష్ చంద్రబోస్, బాహుబలి తదితర సినిమాలతో పాటు కన్నడ సీరియల్స్ సైతం ఇక్కడ చిత్రీకరించారు. కర్నూలు రూరల్ సీఐ పవన్ కుమార్ రెడ్డి, ఎస్ఐ రాజారెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు.

బాలకృష్ణను కలిసిన తుగ్గలి నాగేంద్ర



సినీ హీరో బాలకృష్ణను కలిసిన తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి/ఓర్వకల్లు, జూన్ 27: హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర గురువారం కలిశారు. ఓర్వకల్లులో రాక్‌గార్డెన్స్‌లో జరిగే సినిమా షూటింగ్‌కు వచ్చిన బాలకృష్ణను నాగేంద్ర మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ చిత్ర యూనిట్‌కు తుగ్గలి నాగేంద్రను పరిచయం చేశారు. టీడీపీ కోసం శ్రమించే కార్యకర్తలకు, నాయకులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, పార్టీ అభివృద్ధి కోసం పని చేయాలని బాలయ్య సూచించినట్లు తుగ్గలి నాగేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు చౌదరి, వెంకటేశ్, ఎరుకలి చెరువు శివ తదితరులు ఉన్నారు.

త్వరలో కుల ధృవీకరణ పత్రాలు మంజూరు

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 27: జిల్లాలో వీఆర్వోల ద్వారా వెరిఫికేషన్ చేయించిన తర్వాత కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేస్తామని ఇన్‌చార్జి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల్లో ఇంకా 2,29,685 మంది కుల ధృవీకరణ పత్రాలు తీసుకోలేదని, వారికి సీసీఎల్ఏ ఆదేశానుసారం గురువారం నుంచి వీఆర్వోలు ఇంటింటి సర్వే చేసి కులం, మొబైల్ నెంబర్ తదితర పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని అన్నారు. ఈ వివరాలతో తహసీల్దార్లు కుల ధృవీకరణ చేసిన తర్వాత పత్రాలు ఆటో మేటిక్‌గా జనరేట్ అవుతాయని, వాటిని సచివాలయాల్లో తీసుకోవచ్చని తెలిపారు.

4 నుంచి సంపూర్ణత అభియాన్

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 27: జూలై 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు సంపూర్ణత అభియాన్ కార్యక్రమాలను నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించాలని నీతి అయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం అధికారులను ఆదేశించారు. గురువారం ఢిల్లీ నుంచి నిర్వహించిన నీతి అయోగ్ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు ఎన్ఐసీ ఛాంబర్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీతి అయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన యాస్పిరేషన్ బ్లాక్ ప్రదేశాల్లో ప్రజా ప్రతినిధుల సమక్షంలో కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జిల్లాలోని ప్రతి యాస్పిరేషన్ బ్లాక్‌కు రూ.2 లక్షలను కేటాయింపు ఉంటుందని అన్నారు. కలెక్టరేట్ ఎన్ఐసీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సీపీవో హిమప్రభాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

యాగంటిపల్లె కృషి విజ్ఞానకేంద్రానికి అవార్డు

బనగానపల్లె , జూన్ 27: భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి, వ్యవసాయ సాంకేతికత, పరిశోధన, వినియోగ సంస్థ తరఫున 2023-24 సంవత్సరానికి గాను ఉత్తమ కృషి విజ్ఞానకేంద్రం అవార్డును బనగానపల్లెలోని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రంకో ఆర్డినేటర్ ధనలక్ష్మి గురువారం అందుకున్నారు. ఈనెల 25 నుంచి 27 వరకు రాజమండ్రిలోని ఉద్యాన విశ్వవిద్యాలయం వీఆర్ గూడెం, జాతీయ పొగాకు పరిశోధన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన జోన్ 10 కృషి విజ్ఞానకేంద్రాల వార్షిక జోనల్ సమావేశాల్లో డైరక్టర్లు డాక్టర్ ఆర్కె మాతూర్, హైదరాబాద్‌కు చెందిన జాతీయ నూనె గింజల పరిశోధనా సంస్థ డైరక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా, ఆటారీ వారి ఆధ్వర్యంలో 4 రాష్ట్రాల వ్యవసాయ విశ్వవిద్యాలయాల విస్తరణ సంచాలకులు, నాలుగు రాష్ట్రాల కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు రాజమండ్రిలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు.

తహసీల్దార్లు తహ..తహ...

- లాభదాయకమైన స్థానాల కోసం పోటా పోటీ
- ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు కోసం విశ్వప్రయత్నాలు
- వైసీపీ పాలనలోని రెవెన్యూ శాఖలో అవినీతి అక్రమాలు



కర్నూలు(కలెక్టరేట్), జూన్ 27: సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించడానికి జిల్లాలోంచి బదిలీపై వెళ్లిన తహసీల్దార్లు తిరిగి సొంత జిల్లాకు రానున్నారు. అయితే లాభాదాయకమైన మండల కేంద్రం కోసం అక్కడి నుంచే తహసీల్దార్లు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పని చేస్తామని అవకాశం ఇవ్వాలని కోరుతూ తమకు ఫోన్ చేస్తున్నట్లు నాయకులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. అయితే వైసీపీ నాయకులతో చెట్టాపట్టాలు వేసుకుని తిరిగిన తహసీల్దార్ల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో రెవెన్యూ శాఖలో అవినీతి అక్రమాలకు పాల్పడిన తహసీల్దార్లపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

1 తేదీలోగా పింఛన్ల నగదు జమ చేయాలి

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 27: బ్యాంకర్లందరూ పింఛన్ల పంపిణీకి జూలై 1వ తేదీలోపు బ్యాంకు బ్రాంచీలకు నగదు పంపించేలా చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సంబంధిత బ్యాంకు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి బ్యాంకర్లు కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ) సమావేశం ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ ప్రైమరీ, ఎంఎస్ ఎంఈ సెక్టార్లకు రుణాలు మంజూరు చేయడంలో కొన్ని బ్యాంకు బ్రాంచ్‌లు పురోగతి సాధించడం లేదన్నారు. ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎస్ఆర్ రామచంద్రరావు, నాబార్డు డీడీఎం సుబ్బరెడ్డి, రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ గిరిధర్ బెహేరా, కెనరా బ్యాంకు ఆర్ఎం సుశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇక ప్రాజెక్టులకు మంచి రోజులు

- అత్యవసర పనుల కోసం ప్రతిపాదనలు
- ఉమ్మడి జిల్లాకు రూ.18.50 కోట్లు అవసరం
- ప్రభుత్వానికి నివేదిక పంపిన సీఈ
- జూలై ఒకటిన ప్రాజెక్టులు, కాలువల తాజా పరిస్థితిపై మంత్రి సమీక్ష



ఎల్లెల్సీ పంట కాలువ దుస్థితి

కర్నూలు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గత జగన్ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన సాగునీటి ప్రాజెక్టులు, పంట కాలువల మరమ్మతులపై టీడీపీ ప్రభుత్వం దృష్టి సారించింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో మెకానికల్, సివిల్ పనులకు అత్యవసరంగా ఎన్ని నిధులు కావాలో నివేదిక పంపించాలని రాష్ట్ర ప్రభుత్వం జలవనరుల శాఖ సీఈల నుంచి నివేదికలు కోరింది. అందులో భాగంగానే ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.18.50 కోట్లు తక్షణ అవసరం ఉందని నివేదిక పంపించినట్లు కర్నూలు జిల్లా ఇగిరేషన్ ప్రాజెక్ట్ సీఈ కబీర్‌బాషా గురువారం తెలిపారు. మెకానికల్ రిపేర్ల కింద శ్రీశైలం, సంకేసులు, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ (బీసీఆర్), వెలుగోడు జలాశయం గేట్ల మరమ్మతులు, సివిల్ పనుల కింద జిల్లాలో ఎల్లెల్సీ, కేసీ కెనాల్, తెలుగుగంగ, ఎస్ఆర్‌బీసీ.. వంటి కాలువల్లో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్, కాలువ గట్లు బలోపేతం వంటి పనులు అత్యవసరంగా చేపట్టాలని ఆ నివేదికలో పేర్కొన్నారు. తాత్కాలిక బడ్జెట్ (ఒటాన్ అకౌంట్ బడ్జెట్)లో అత్యవసర పనులకే ప్రతిపాదనలు పంపామని, శాశ్వత మరమ్మతులకు ఎన్ని నిధులు అవసరమయ్యేదీ అంచనా వేస్తున్నామని ఆయన తెలిపారు.

అలాగే.. జూలై ఒకటో తారీఖున ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రధాన కార్యదర్శి ప్రాజెక్టులు, కాలువ తాజా పరిస్థితిపై సమీక్ష (రివ్యూ) సమావేశం ఉంటుందని, ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వివిధ ప్రాజెక్టుల సమగ్ర వివరాలతో సమీక్షా సమావేశానికి హాజరై రాయలసీమ ప్రాజెక్టుల తాజా పరిస్థితిపై వివరిస్తామని తెలిపారు. అయితే.. ఐదేళ్లుగా గత జగన్ ప్రభుత్వం రాయలసీమ సాగునీటి వనరులపై పూర్తి స్థాయిలో నిర్లక్ష్యం ప్రదర్శించింది. సీఎం చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం రావడం, ప్రాజెక్టుల అత్యవసరం మరమ్మతులపై దృష్టి సారించడంతో రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతుంది.

డీసీసీబీ, కేడీసీఎంఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 27: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జిల్లా సహకార కేంద్ర బ్యాంకుతో పాటు జిల్లా మార్కెటింగ్ సొసైటీలకు జాయింట్ కలెక్టర్లను పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్ గురువారం జీవో.నెం.404ను జారీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో సహకార కేంద్ర బ్యాంకులను భ్రష్టు పట్టించి రైతులకు అందించే రుణాలను పక్కదారి పట్టించారనీ ప్రస్తుతం అధికారం చేపట్టిన తెలుగుదేశం పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. కొండలు, గుట్టలకు రుణాలు అందించడమే కాకుండా గొర్రెలు, పాడిగేదెలు వంటి వాటికి ఒక్కొక్కరికి రూ.లక్షల్లో రుణాలు అందించేందుకు ఆనాటి బ్యాంకు ఉన్నతాధికారులు, చైర్మన్లు అత్యుత్సాహం చూపారు. చాలా బ్యాంకుల పరిధిలో బోగస్ పేర్లతో పెద్దఎత్తున మహిళా సంఘాలను ఏర్పాటు చేసి వారికి రుణాలు ఇప్పించేందు కోసం సీఈవోలపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు సమాచారం. కర్నూలు, నంద్యాల జిల్లాలో దాదాపు 600 పొదుపు గ్రూపులను ఏర్పాటు చేసి ఒక్కో గ్రూపుకు రూ.లక్ష చొప్పున రుణాలు అందించాలని గత వైసీపీ ప్రభుత్వంలో పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరిగాయి. వీటిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలని సర్వత్రా డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లోని గత ప్రభుత్వం ఆదేశాలతో పదవులు పొందిన పర్సన్ ఇన్‌చార్జిలను తొలగిస్తూ టీడీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పాలక వర్గాలకు ఎన్నికలు జరిపేంత వరకు జిల్లా జాయింట్ కలెక్టర్లే పర్సన్ ఇన్‌చార్జిలుగా కొనసాగుతారనీ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

హొళగుంద, జూన్ 27: మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన హొళగుంద మండలంలోని నెరణికి గ్రామంలో చోటు చేసుకుంది. నెరణికి చెందిన బోయ శేఖర్ (20) గ్రామంలో దినసరి కూలిగా జీవనం సాగించేవాడు. రెండేళ్ల క్రితం శ్రీదేవితో వివాహం జరిగింది. గత 15 రోజుల క్రితం శ్రీదేవి పండండి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఇదిలా ఉండగా రెండురోజుల క్రితం శేఖర్ కుటుంబ సభ్యులు తెలంగాణలోని జహీరాబాద్‌కు వలస కూలీలుగా వెళ్లారు. ఈ క్రమంలో మృతుడు బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో మద్యం మత్తులో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పెద్దయ్య నాయుడు తెలిపారు.

గనుల శాఖ తనిఖీల్లో నాపరాయి లారీలు సీజ్

కర్నూలు(అర్బన్), జూన్ 27: గనుల శాఖ తనిఖీల్లో అక్రమంగా నాపరాయి తరలిస్తున్న 3 వాహనాలను సీజ్ చేసినట్లు డిప్యూటి డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. గురువారం తెల్లవారు జామున పుల్లూరు టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో జిల్లా నుంచి తెలంగాణ రాష్ట్రానికి తరలిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ వాహనాలకు రూ. 70 జరిమాన విధించినట్లు తెలిపారు. వాహనాలను సీజ్ చేసి తదుపరి చర్యలకు ఆదేశించామని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్స్‌పెక్టర్ మురహరి తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

'నీటి ట్యాంకులు శుభ్రం చేయకపోతే చర్యలు'



తుమ్మలూరు గ్రామంలో నీటి ట్యాంకును పరిశీలిస్తున్న డీఈ

పాములపాడు, జూన్ 27: మండలంలోని గ్రామాలలో నీటి ట్యాంకులను సకాలంలో శుభ్రపరచి నీటిని సరఫరా చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్ సిబ్బందిని హెచ్చరించారు గురువారం మండలలంలోని తుమ్మలూరు గ్రామంలో నీటి ట్యాంకులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నీటి ట్యాంకుల శుభ్రపరిచినప్పుడు వాటిపై తేదీలను కనపరచాలన్నారు. వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, నీటిని క్లోరినేషన్ చేయాలని సూచించారు. ఏఈ అనిల్, సర్పంచ్ వరప్రసాద్, పీఎస్ కళ్యాణ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అశోక్ తదితరులు ఉన్నారు.

'అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉత్తమ విద్య'



ఉప్పలదడియ గ్రామంలో అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ

మిడుతూరు, జూన్ 27: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉత్తమ విద్యతో పాటు మంచి క్రమశిక్షణ అలవడుతుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మలమ్మ అన్నారు. మండలంలోని ఉప్పలదడియ గ్రామంలో అంగన్‌వాడీ బడి బాట కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ మూడేళ్లు దాటిన పిల్లలను అంగన్‌వాడి కేంద్రంలో చేర్పించాని గ్రామస్థులకు సూచించారు. అనంతరం 14 మంది అంగన్‌వాడీ సెంటర్‌లో చదివిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తూ హెచ్ఎం మల్లికార్జున నాయక్‌కు అప్పజెప్పారు. కార్యక్రమంలో ఏసీడీపీవో మంగవల్లి, సీడీపీవో కోటేశ్వరమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వరలక్ష్మి, రేణుకాదేవి, అంగన్‌వాడీ టీచర్లు, మహేశ్వర రెడ్డి, ఆయాలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'అక్రమాలను అడ్డుకున్నందుకే ఈవోపై ఆరోపణలు'

కొత్తపల్లి, జూన్ 27: కొలనుభారతి పుణ్యక్షేత్రంలో దినసరి వేతనం కింద విధులు నిర్వహిస్తున్న అర్చకుడు చక్రపాణి శర్మ అవినీతి అక్రమాలను అడ్డుకున్నందుకే ఆయన క్షేత్ర ఈవో మోహన్‌పై ఆరోపణలు చేశారని, ఇది సరికాదని ఆలయ ప్రధాన అర్చకుడు గెంట్యాల శ్రీనివాసశర్మ, గెంట్యాల జయభారతి అన్నారు. ఈవోపై చర్యలు తీసుకోవాలని చక్రపాణి శర్మ ప్రకటన ఇవ్వడంపై ప్రధాన అర్చకుడు శ్రీనివాస శర్మ గురువారం స్పందించారు. క్షేత్రంలో దినసరి వేతనం కింద విధులు నిర్వహిస్తున్న అర్చకుడు చక్రపాణి శర్మ లేనిపోని ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. చక్రపాణి శర్మ క్షేత్రంలో పలు అవినీతి, అక్రమాలకు పాల్పడుతుండటంతో ఈవో స్పందించి ఆయనను మందలించారని, దీంతో ఈవోతో పాటు తనపై చక్రపాణి ఆరోపణలు చేశారని ధ్వజమెత్తారు. ఇప్పటికే చక్రపాణి శర్మపై దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని చెప్పారు.

'ప్రస్తుత డీలర్లనే కొనసాగించాలి'



డిప్యూటీ తహసీల్దార్ వినతి పత్రం అందిస్తున్న బైరెడ్డి వర్గీయులు

మిడుతూరు, జూన్ 27: మిడుతూరు మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రస్తుత డీలర్లను అదేవిధంగా కొంత కాలం కొనసాగించాలని బైరెడ్డి వర్గీయులు మిడుతూరు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ షానవాజ్‌కు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ మిడుతూరు మండల పరిధిలోని రేషన్ డీలర్లపై కొంత మంది రాజీనామా చేయాలని ఒత్తిడి చేయిస్తున్నారని వారు ఆరోపించారు. జీవో విడుదల అయ్యే వరకు రెవెన్యూ అధికారులు ప్రస్తుత డీలర్లనే కొంత కాలం వరకు కొనసాగించాలని వారు కోరారు. కార్యక్రమంలో సీతరామి రెడ్డి, కాతా అంకిరెడ్డి, అయ్యపు రెడ్డి, శ్రీనివాస రెడ్డి, రామక్రిష్ణా రెడ్డి, కాల రమేష్, గోకారి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'ప్రతి ఒక్కరూ చదువుకోవాలి'

బండిఆత్మకూరు, జూన్ 27: ప్రతి ఒక్కరూ చదవాలి, అందరూ ఎదగాలి అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. గురువారం మండలంలోని ఎర్రగుంట్ల హైస్కూల్ విద్యార్థులు నేను బడికిపోతా కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి, ప్రధాన కూడలిలో మానవహారం చేపట్టారు. ఎంఈవో మోహన్‌రెడ్డి, హెచ్ఎం రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాములపాడు: బడి ఈడు చిన్నారులను పాఠశాలకు పంపించా లని, పనులకు పంపించ వద్దని విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. గురువారం వేంపెంట గ్రామంలోని జడ్పీ హైస్కూల్ హెచ్ఎం కృష్ణమూర్తి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వరరెడ్డి, రంగారెడ్డి, షరీఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

'యోగాతో మానసిక ప్రశాంతత'

ఆత్మకూరు, జూన్ 27: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ లీలావతి అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆమె ఆత్మకూరు పట్టణంలోని కస్తుర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థినీలకు యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించడంతో పాటు యోగా ఆసనాలను చేయించారు. ప్రిన్సిపాల్ శ్యామల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సూర్యకుమారి, రమాదేవి, కోమల, శివకుమారీ, కవిత, హెల్త్ సూపర్‌వైజర్ మస్తానయ్య, మెరిబా సంస్థ ప్రతినిధి రాజు తదితరులు ఉన్నారు.

'వయో పరిమితి పెంచాలి'

నంద్యాల (నూనెపల్లె), జూన్ 27: డీఎస్సీ అభ్యర్థులకు వయో పరిమితి 48 సంవత్సరాలకు పొడిగించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు ఎస్ఎండీ రఫీ కోరారు. గురువారం డీఎస్సీ అభ్యర్థుల అభ్యర్థన మేరకు సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌కు బహిరంగ లేఖ రాసినట్లు తెలిపారు. ఎన్నికల ముందు కూటమి మేనిఫెస్టో ప్రకారం డీఎస్సీపై తొలి సంతకం చేసి హామీని నిలబెట్టుకున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. ఆరేళ్ల నుంచి డీఎస్సీ లేక పోవడంతో నిరుద్యోగులు ఎదురు చేసి వయో పరిమితి మించి పోయిందని, వారిని దృష్టిలో ఉంచుకుని వయో పరిమితి పెంచాలని కోరారు.

ఆక్రమిత స్థలాలు స్వాధీనం చేసుకోండి

● మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే జయసూర్య ఆదేశం



నందికొట్కూరులో ఆక్రమణకు గురైన మున్సిపల్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు, జూన్ 27: నందికొట్కూరు పట్టణంలో ఆక్రమణకు గురైన మున్సిపల్ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని మున్సిపల్ అధికారులను నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆదేశించారు. గురువారం పట్టణంలోని ముబారక్ ఫంక్షన్ హాల్ వెనుక భాగంలో ఆక్రమణకు గురైన మున్సిపాలిటీ స్థలాన్ని ఆయన పరిశీలించారు. మున్సిపాలిటీకి చెందిన స్థలం ఎలా కబ్జాకు గురవుతుందని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆయన ప్రశ్నించారు. పట్టణంలో ఎక్కడెక్కడ మున్సిపాలిటీ స్థలాలు ఉన్నాయో వాటిలో పిచ్చిమొక్కలను తొలగించి 24 గంటల్లో బౌండరీలు ఏర్పాటు చేసి, మున్సిపాల్టీ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో టీపీవో బాలమద్దయ్య, పట్టణాధ్యక్షుడు బాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్ జాకీర్, ముర్తుజావళి, జమీల్, సౌదీ చాంద్, గని, రాజు, రాజన్న తదితరులు ఉన్నారు.

● మున్సిపాలిటీ పరిధిలో పని చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు, డైలీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వర్కర్స్ నాయకుడు పరమేష్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు, ఎనిమిది సంవత్సరాల నుంచి 10 సంవత్సరాలుగా పని చేస్తున్న 52 మంది దినసరి కార్మికులను ఆప్కోసులో కలిపి వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. సీఐటియూ నాయకులు నాగన్న, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: హైవే పక్కనే పాఠశాలను నిర్మిస్తే విద్యార్థులు ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మండలంలోని రుద్రవరం గ్రామంలో నేషనల్ హైవే పనుల్లో భాగంగా ప్రాథమిక పాఠశాలను కూల్చివేశారు. మిగిలిన కొంతమేర స్థలంలో రెండు అంతస్తులు నిర్మించేందుకు విద్యాశాఖ ప్రణాళికలు చేస్తుందని, అయితే హైవే పక్కన పాఠశాల నిర్మిస్తే ప్రమాదాలు జరుగుతాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే.. పాఠశాలకు అనువైన స్థలాన్ని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామంలో ఓ వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. టీడీపీ నాయకులు మహేశ్వరరెడ్డి, హరినాథ్‌రెడ్డి, గోవిందు, సురేశ్, శంకర్‌స్వామి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజీ లక్ష్యాన్ని ఛేదించండి: కలెక్టర్



డీఆర్డీఏ, సెర్ప్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

నంద్యాల (కల్చరల్), జూన్ 27: ఈ ఆర్థిక సంవత్సరం బ్యాంకు లింకేజీ కింద అర్హులైన స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంలో ప్రగతి సాధించాలని కలెక్టర్ కె.శ్రీనివాసులు డీఆర్డీఏ, సెర్ప్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన తన చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. డీఆర్డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, డీపీఎం ఏరియా కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ కింద ఈ ఆర్థిక సంవత్సరం 22,317 స్వయం సహాయక సంఘాలకు రూ.1370 కోట్ల రుణాలు మంజూరు లక్ష్యాన్ని అధిగమించేందుకు ప్రత్యేక కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలలోని సభ్యులకు వ్యక్తిగత రుణాలు ఇప్పించేందుకు కూడా ప్రభుత్వం రూ.90.36కోట్ల రూపాయలు లక్ష్యాన్ని నిర్దేశించిందని, ఈ మేరకు జిల్లాలోని 6,450 మందికి వ్యక్తిగత రుణాలు ఇప్పించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలలో సభ్యులు నెలవారి జమచేసుకున్న పొదుపును బ్యాంకుల్లో అలాగే ఉంచకుండా అంతర్గత అప్పులు తీసుకునే సౌకర్యం కలిగించాలన్నారు. జిల్లాలో దాదాపుగా రూ.254 కోట్లు బ్యాంకులలో వృథాగా ఉన్నాయని, ఈ మొత్తాన్ని అంతర్గత అప్పులు ఇచ్చుకునే విధంగా సంబందిత సీసీలు, ఏపీఎంలు, ఏరియా కోఆర్డినేటర్లు బాధ్యత తీసుకొని వ్యక్తిగత రుణాలు ఇప్పించాలని సూచించారు. వీటిద్వారా వారి జీవనోపాదికి కృషి చేయాలన్నారు. శ్రీనిధి, ఉన్నతి పథకాల ద్వారా తీసుకున్న రుణాలను 100శాతం రికవరీ అయ్యేటట్లుగా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

● నంద్యాల పట్టణ ప్రజల తాగునీటి అవసరాల కోసం గుర్తించిన అదనపు ఎస్ఎస్ ట్యాంకు ఫీజబిలిటీని పరిశీలించి నివేదికలు అందజేయాలని కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డిని ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో అమృత్ స్కీం, డయేరియా నియంత్రణపై మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాలలో తాగునీటికోసం ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం కోసం గుర్తించిన 150 ఎకరాల స్థల ఫీజబిలిటీని క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలు అందజేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గోరుకల్లు నుంచి అప్ కమింగ్ స్కీంల ద్వారా డ్రాచేసుకునే నీటి వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా కోసం స్పెషల్ కాంపోనెంట్ కింద మంజూరైన పనులను గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అమృత్ పథకం కింద చేపట్టిన పనుల వివరాలను తెలుసుకుని పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

హాస్టళ్ల తనిఖీ



విద్యార్థినితో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల (నూనెపల్లె), జూన్ 27: నంద్యాలలోని బాలికల సమీకృత వసతి గృహం, పలు హాస్టళ్లను జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మౌలిక వసతులను ఆయన పరిశీలించారు. వార్డన్‌లతో మాట్లాడారు. విద్యార్థుల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోజన నాణ్యతను పరిశీలించారు. జేసీ మాట్లాడుతూ.. వసతి గృహాల నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉంటూ తమ దృష్టికి తీసుకురావాలని, వార్డన్లు విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా విద్యార్థుల అభ్యున్నతికి పాటు పడాలని సూచించారు.

'హోటళ్లను శుభ్రంగా ఉంచుకోవాలి'

ప్రజల ఆరోగ్య దృష్ట్యా వర్షాకాలంలో సంభవించే సీజన్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని హోటళ్లు, రెస్టారెంట్లు ఇతర తినుబండారాల విక్రయశాలలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ముఖ్యంగా వ ంట గదులో క్రిమికీటకాలు ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తయారుచేసిన ఆహార పదార్థాలను ఓపెన్‌గా ఉంచకుండా మూతలను కప్పి ఉంచాలన్నారు. శాఖాహార, మాంసాహార ఆహార పదార్థాల తయారీలో నాసిరకం ముడి సరుకులు కృత్రిమ రసాయన రంగులు, టెస్టింగ్ సాల్ట్ తదితర పదార్థాలు వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మిగిలిపోయిన పదార్థాలను ఫ్రిజ్‌లో నిల్వ చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యమైన, మేలు రకమైన ముడి సరుకులను ఆహార పదార్థాల తయారీకి వినియోగించాలన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లో పనిచేసే సిబ్బందికి హెడ్ క్యాప్స్, యూనిఫామ్స్ తప్పక ధరించేలా చర్యలు తీసుకోవాలని జేసీ సూచించారు. హోటళ్లు, రెస్టారెంట్స్ ఎఫ్ఎస్ఎస్ఏఐ ఫుడ్ లైసెన్స్ కౌంటర్‌లో వినియోగదారులందరికీ కనపడేలా ప్రదర్శించాలన్నారు. జిల్లా ఆహార భద్రత కార్యాలయం, డోర్‌నెంబరు 28-14-66రైల్వే స్టేషన్ రోడ్, నూనెపల్లెలో లిఖిత పూర్వకంగా గానీ, 94414 39787, 94411 14429, 94949 37578 నెంబర్లకు ఫోన్ చేసి గానీ ఫిర్యాదు చేయవచ్చని కస్టమర్లకు తెలిపారు.

బీజేపీ శ్రీశైలం కో ఆర్డినేటర్‌గా మోమిన్ షబానా



బీజేపీ శ్రీశైలం కో ఆర్డినేటర్‌గా ఎన్నికైన మోమిన్ షబానా

ఆత్మకూరు, జూన్ 27: బీజేపీ శ్రీశైలం నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబానా నియమితులయ్యారు. గురువారం ఆత్మకూరు పటణంలోని ఎంఅండ్ఎం ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ కోఆర్డినేటర్ అభిరుచి మధు హాజరయ్యారు. శ్రీశైలం నియోజకవర్గం కో ఆర్డినేటర్‌గా మోమిన్ షబానాను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వెలుగోడులో పూజలు

వెలుగోడు: వెలుగోడులోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో బీజేపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ కోఆర్డినేటర్ అభిరుచి మధు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న అభిరుచి మధుకు ఆలయ నిర్వాహకులు బీవీ సత్యనారాయణ స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువా కప్పి దేవతా మూర్తుల చిత్ర పటాలను అందించి ఆలయ నిర్వాహకులు సన్మానించారు.

'సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీ'

కొత్తపల్లి, జూన్ 27: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ఆయా గ్రామాల సచివాలయాల సిబ్బంది ద్వారానే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో జవహర్‌బాబు తెలిపారు. గురువారం ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో 4,344 మందికి వివిధ రకాల పింఛన్లు వంద శాతం పంపిణీ చేసేలా సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు.

ప్రత్యేక వైద్య శిబిరం

ఆత్మకూరు రూరల్, జూన్ 27: ఆత్మకూరు మండలంలోని సంజీవ్‌నగర్ తండాలో గురువారం ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి చికిత్సలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి పవన్‌కుమార్ ప్రజలకు సూచించారు. గ్రామంలో పర్యటించి వర్షపు నీరు నిలువ ఉన్న ప్రాంతాలు, డ్రైనేజీలలో బ్లీచింగ్ చేయించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ రమణమ్మ, సీహెచ్‌వో శివ,ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరు, జూన్ 27: చెంచు గర్భిణులు ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు పాటించాలని ఆత్మకూరు సామాజిక వైద్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ రాయుడు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా సూచించారు. గురువారం స్థానిక వైద్యశాలలో చెంచు గర్భిణుల కోసం ప్రత్యేకంగా శిబిరాన్ని ఏర్పాటు చేసి స్కానింగ్, రక్త పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా పోషకాలతో కూడిన మందులను పంపిణీ చేశారు. రక్తహీనత ఉన్నవారికి రక్తం పెరిగేందుకు తీసుకోవాల్సిన విషయాలను వివరించారు. వారు మాట్లాడుతూ.. చెంచు మహిళల్లో రక్తహీనత అధికంగా ఉంటుందని, ఈ కారణంగా ప్రసవ సమయంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు కవిత, నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

నంద్యాల (నూనెపల్లె), జూన్ 27: ప్రయాణికుల సౌకార్యార్థం వారికి మెరుగైన సేవలందించేందుకు, సమస్యల పరిష్కారానికి శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు నంద్యాల డిపో మేనేజర్ గంగాదరరావు గురువారం తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలు తెలిపేందుకు 9959225800 నంబరుకు ఫోన్ చేయాలని తెలిపారు.

'కార్యకర్తలకు అండగా ఉంటా'

ఆత్మకూరు, జూన్ 27: అధైర్యపడకండి కార్యకర్తలకు అండగా ఉంటానని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ శ్రేణులతో ఆయన సమీక్షించారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని కార్యకర్తలెవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని తెలిపారు. నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, మోమిన్ అహ్మద్‌హుసేన్, సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, ఎంపీపీ తిరుపాలమ్మ తదితరులు ఉన్నారు.

'తంగడంచ భూములు పేదలకు పంచాలి'

జూపాడుబంగ్లా, జూన్ 27: అభివృద్ధికి నోచుకోకుండా చిట్టడివిలా తయారైన తంగడంచ విత్తనోత్పత్తిక్షేత్రం భూములను పేదలకు పంచాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ డిమాండు చేశారు. గురువారం జూపాడుబంగ్లాలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. నాయకులు సుబ్బరాయుడు, వీరన్న, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేటు పాఠశాలల్లో దోపిడీ'

నందికొట్కూరు, జూన్ 27: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి విచ్చలవిడిగా ఫీజులు దోపిడీ చేస్తున్న ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం కార్యాలయంలో సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు భాస్కర్‌రెడ్డి, నాగన్న, రాజు, నాయుడుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రైవేట్ స్కూల్‌స ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా రకరకాల ఫీజుల పేరుతో వేలాది రూపాయలు వసూళ్లు చేస్తున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు.

మొక్కజొన్న పంటల పరిశీలన

ఆత్మకూరు రూరల్, జూన్ 27: మండంలోని బాపనంతాపురం సాగు చేస్తున్న మొక్కజొన్న పంటలను గురువారం వ్యవసాయాధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం మొక్కజొన్న పంటకు ఆశిస్తున్న కత్తెర పురుగును నివారించేందుకు రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని ఏవో విష్ణువర్ధన్‌రెడ్డి రైతులకు సూచించారు. ఆయన వెంట ఎంపీఈవోలు, రైతులు ఉన్నారు.

'పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి'

ఆత్మకూరు రూరల్, జూన్ 27: గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈవోఆర్డీ మోహన్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సువర్చల సూచించారు. గురువారం అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి పవన్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మహిళ అదృశ్యం

మహానంది, జూన్ 27: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత గత మూడు రోజుల క్రితం అదృశ్యం అయినట్లు ఆమె తల్లితండ్రులు గురువారం ఫిర్యాదు చేశారని ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఏడాది క్రితమే మహిళకు వివాహం అయిందని తెలిపారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటాం'



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

నంద్యాల (నూనెపల్లె), జూన్ 27: దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు చంద్రబాబు పెంచడంతో కూటమి ప్రభుత్వానికి రుణ పడి ఉంటామని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గంగాదర శెట్టి అన్నారు. గురువారం ఎమ్మార్పీఎస్, వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్ శ్యాం సుందర్‌లాల్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బాయికాటి బెనర్జి, మాదిగ పోరాట సమితి జిల్లా నాయకులు హాజరయ్యారు. శ్రీనివాస సెంటరులోని ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. సీఎం చంద్రబాబు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందక్రిష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా నాయకులు కత్తి ఓబులేసు, ఇంతియాజ్, మద్దిలేటి, ఎల్లమ్మ పాల్గొన్నారు.

హామీలు నెరవేరుస్తాం: మంత్రి



మంత్రి ఫరూక్‌ను కలిసిన అగ్నిమాపకశాఖ అధికారులు

నంద్యాల (నూనెపల్లె), జూన్ 27: ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించకుండా తప్పక నెరవేరుస్తామని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. గురువారం మంత్రి ఫరూక్‌ను వివిధ పార్టీ నాయకులు వివిధ శాఖల అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలు అందించి శాలువాతో సన్మానించారు. మంత్రి మాట్లాడుతూ చంద్ర బాబు చెప్పిన విధంగా మొదటి 5 సంతకాలు చేసి హామీలను నిరూపించారని, అదేవిధంగా రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమ పాలనను అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'హిందూ శ్మశానానికి దారి కల్పించాలి'



మంత్రి ఫరూక్‌కు వినతి పత్రం అందజేస్తున్న రావినూతల లా అసోసియేట్ సభ్యులు

నంద్యాల (కల్చరల్), జూన్ 27: నంద్యాలలో ఆర్టీసీ బస్టాండు పక్కన ఉన్న హిందూ శ్మశాన వాటికకు దారి కల్పించాలని రావినూతల లా అసోసియేట్ సభ్యుడు రావినూతల దుర్గాప్రసాద్ గురువారం రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ శ్మశానం చాలా పురాతనమైనదని, పట్టణంలోని హిందువులందరూ ఈ శ్మశానాన్ని ఉపయోగించుకుంటున్నారు. గతంలో ఆంజనేయస్వామి గుడి పక్కన రస్తా చాలా విశాలంగా ఉండడంతో వైకుంఠ రథం రాకపోకలకు అంతరాయం లేకుండా ఉండేదన్నారు. అయితే ప్రస్తుతం కొందరు ఆ దారిని ఆక్రమించుకోవడంతో పాటు ఆటోలు, మంచాలు రోడ్డుపైన ఉంచడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని అన్నారు. రస్తాలో ఉన్న అక్రమాలను తొలగించాలని కోరారు. ఆంజనేయ స్వామి గుడి నుంచి శ్మశానం మెయిన్ గేటు వరకు 4 అడుగుల ఎత్తులో 30 అడుగుల వెడల్పు గల రోడ్డు వేస్తే ఎలాంటి ఆటంకాలు ఉండవని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

బోర్‌వెల్ లారీ బోల్తా.. ఆరుగురికి గాయాలు

మహానంది, జూన్ 27: మహానంది మండలం నల్లమల అటవీ ప్రాంతంలోని ప్రధాన మలుపులోని పాత బొగద టన్నెల్ వద్ద బోరుబండి లారీ అదుపుతప్పి బోల్తా పడింది. అందులోని రాజస్థాన్‌కు చెందిన ఆరుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. గురువారం గిద్దలూరు నుంచి నంద్యాల వైపు వస్తున్న బోరు లారీ మార్గమధ్యంలోని నల్లమల అటవీ ప్రాంతంలోని పాత బొగద టన్నెల్ వద్దకు రాగానే అదుపుతప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో లారీ డ్రైవర్ జీవన్‌లాల్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న కూలీలు ప్రకాష్, శ్యామ్‌లాల్, నారాయణతో పాటు మరో ఇద్దరు గాయపడ్డారు. మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ ఘటనా స్థలానికి రోడ్డు సేఫ్టీ పోలీసులను పంపించి సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడ్డ కూలీలను చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్‌బీకే తనిఖీ

కొత్తపల్లి, జూన్ 27: గువ్వలకుంట్లలోని రైతు భరోసా కేంద్రాన్ని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు ఆంజనేయ గురువారం ఏవో మహేష్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్‌బీకేలో ఉన్న ఎరువులను, రిజిస్టర్‌ను పరిశీలించారు. వ్యవసాయ సహాయ సంచాలకుడు రైతులు స్థానిక రైతుభరోసా కేంద్రాల్లో కౌలు కార్డులు పొందాలని సూచించారు. అలాగే గ్రామంలోని విత్తన దుకాణ రిజిస్టర్లను, బిల్‌బుక్‌లను పరిశీలించారు. వీఆర్వో చంద్రశేఖర్, రైతుభరోసా కేంద్ర సిబ్బంది ఉన్నారు.

'ఎన్నికల అలవెన్స్ చెల్లించాలి'

ఆత్మకూరు, జూన్ 27: శ్రీశైలం నియోజకవర్గం పరిధిలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన సచివాలయ ఉద్యోగులకు ఇచ్చేటువంటి అలవెన్స్‌ను ఇవ్వాలని సచివాలయ ఉద్యోగులు కోరారు. గురువారం వారు తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని సంబంధిత అధికారులను తమ అలవెన్స్‌లపై ప్రశ్నించారు. వారు మీడియాతో మాట్లాడుతూ.. సుమారు మూడు నెలల పాటు తాము ఎన్నికల విధుల్లో హాజరైనప్పటికీ తమకు ఇంతవరకు అలవెన్స్ ఇవ్వలేదని, ఇతర నియోజకవర్గాల్లో ఇప్పటికే అలవెన్స్‌లను ఇచ్చినట్లు తెలిపారు. అయితే తాము చాలారోజులుగా తమ అలవెన్స్‌ల గురించి సంబంధిత ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ రోజులు దాటవేశారని వాపోయారు. ఈవిషయంపై తహసీల్దార్ బాబును వివరణ కోరగా తమకు మొత్తం 1.08కోట్లు ఎన్నికల ఖర్చు కింద మంజూరైందని, ఇప్పటికే రూ.95లక్షలు విడుదల కాగా వాటిని ఆయా ఖర్చులకు చెల్లించినట్లు తెలిపారు. జరిగిందని తెలిపారు. మిగిలిన రూ.13లక్షలు పెండింగ్ ఉండటం వల్ల ఎన్నికల విధుల్లో పాల్గొన్న సచివాలయ ఉద్యోగులకు అలవెన్స్‌లను ఇవ్వలేకపోయామని వివరించారు. ఇదిలావుంటే ఈ విషయం చెప్పిన కాసేపటికి ఎన్నికల విధుల్లో పాల్గొన్న సచివాలయ ఉద్యోగులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున గౌరవ వేతనాలను రెవెన్యూ సిబ్బంది పంపిణీ చేయడం గమనార్హం. అయితే పలు నియోజకవర్గాల్లో తమలాంటి విధులు నిర్వర్తించిన సచివాలయ సిబ్బందికి రూ.27వేల వరకు గౌరవ వేతనాలు ఇచ్చారని, తమకు కేవలం రూ.10వేలు ఇచ్చారని సచివాలయ ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఎమ్మెల్సీని కలిసిన ఉపాధ్యాయ సంఘ నాయకులు


ఎమ్మెల్సీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కోవెలకుంట్ల, జూన్ 27 : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ (ఆర్‌జెయూపీ) సంఘ నాయకులు పులివెందుల పట్టణంలో గురువారం ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా ఉపాధ్యాయులు కలిసి సమస్యలు వివరించారు. ఆర్‌జేయూపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్తోజు వీరబ్రహ్మం, రాష్ట్ర అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ ఏకీకృత సర్వీసు రూల్స్, ఉపాధ్యాయ నియామక పరీక్షలు, జూనియర్ లెక్చరర్లు, డైట్ లెక్చరర్ ప్రమోషన్లు, మోడల్ స్కూలు, కేజీబీవీ టీచర్ల సమస్యలతో పాటు వివిధ విద్యారంగ సమస్యలపై వినతి పత్రం సమర్పించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, పీరయ్య, క్రిష్టారెడ్డి, చరణ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడుల కోసం యాజమాన్య పద్ధతులు పాటించాలి

● జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

డోన్(రూరల్), జూన్ 27: అధిక దిగుబడుల కోసం యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, డోన్ వ్యవసాయ ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని మార్కెట్ యార్డు సమావేశ భవనంలో యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం ఆవరణలో రైతుభరోసా సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి మాట్లాడుతూ రైతులు రసాయనక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. మూడు నెలలకొకసారి మట్టి నమూనాలను పరీక్షించుకోవాలన్నారు. అనంతరం శాస్త్రవేత్తలు రమణయ్య, ఆదినారాయణ, రవిగౌడు శిక్షణ కార్యక్రమంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల వ్యవసాయాధికారులు అబ్దుల్‌షఫీ, రాజేష్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డోన్(రూరల్), జూన్ 27: ప్రస్తుత వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి సూచించారు. గురువారం పాఠశాలలో హెల్త్ అసిస్టెంట్ సునీత వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇంటి పరిసరాలు, పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కలుషిత నీరు తాగడం వల్ల డయేరియా వంటి వ్యాధుల బారిన పడుతారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం సుబ్బారెడ్డి, వెంకటలక్ష్మి, వెంకటరమణ, లక్ష్మయ్య, రవిశేఖర్, శ్రీనివాసులు, రాధ, జయసుబ్బరాయుడు, సుభాన్, మధుసూదన్ రెడ్డి, సుబ్బరాయుడు, సంజీవరెడ్డి, భూకాంతరెడ్డి పాల్గొన్నారు.

'క్షయవ్యాధి నివారణకు బీసీజీ టీకాలు'


చాగలమర్రిలో బీసీజీ టీకాలు వేస్తున్న ఏఎన్ఎంలు

చాగలమర్రి, జూన్ 27: గ్రామాల్లో క్షయవ్యాధి నివారణ కోసమే బీసీజీ టీకాలు వేస్తున్నామని వైద్యశాఖ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి తెలిపారు. గురువారం చాగలమర్రి గ్రామంలోని సచివాలయ పరిధిలో వేస్తున్న బీసీజీ టీకాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 18 నుంచి 60 ఏళ్లు పైబడిన వారికి బీసీజీ టీకాలు వేస్తున్నామని తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

పాఠశాల తనిఖీ

చాగలమర్రి, జూన్ 27: చాగలమర్రి గ్రామంలోని గిరిజన కాలనీలో గల ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈవో న్యామతుల్ల తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలని హెచ్ఎంకు సూచించారు. విద్యార్థులకు పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత ఉండేలా చూడాలని అన్నారు. మెనూ ప్రకారం నిర్వహించాలన్నారు. విద్యార్థులకు కాసేపు పాఠాలు చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

'మరమ్మతులు చేయించాలి'

రుద్రవరం, జూన్ 27: మండలంలోని నరసాపురం గ్రామంలో గురువారం ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ పైపులైనుల లీకేజీలు, పాత ట్యాంకులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కురుస్తున్న వర్షాలకు నీరు నిల్వ చేరి అందులో దోమలు వృద్ధి చెందుతున్నాయన్నారు. ఈ దోమల వల్ల మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. నీరు కలుషితం కావడం వల్ల అతిసారం వస్తుందన్నారు. ప్రధానోపాధ్యాయులను సబ్బు ఏర్పాటు చేయాలని చెప్పగా తమ వద్ద డబ్బులు లేవని చెప్పడం గమనార్హం. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

ముగిసిన టీడీపీ కార్యకర్త అంత్యక్రియలు

నంద్యాల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): హత్యకు గురైన టీడీపీ కార్యకర్త శ్రీదేవి అంత్యక్రియలు గురువారం నిర్వహించారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ ఏర్పాటు చేశారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని శ్రీదేవి బంధువులు డిమాండ్ చేశారు.

ప్రశాంతంగా జీవించాలి: ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ నియోజకవర్గ ప్రజలు ప్రశాంతంగా జీవించాలన్నదే లక్ష్యమని ఎమ్మెల్యే అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డలో కిరాయి హంతకులు రెచ్చిపోతే చూస్తూ ఉండబోమని అన్నారు. శ్రీదేవి హత్య కేసులో తప్ప నిందితులను అరెస్టు చేయాలని ఆమె డిమాండు చేశారు.

టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు

నంద్యాల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ సమక్షంలో వైసీపీ కౌన్సిలర్లు వెంకటసుబ్బమ్మ, బాలబ్బి, మల్లేశ్వరి గురువారం టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆళ్లగడ్డ మున్సిపాలిటీలో ఇప్పటికే 8 మంది టీడీపీ ఖాతాలో చేరారని, ఈ ముగ్గురితో టీడీపీ కౌన్సిలర్ల సంఖ్య 11కు చేరుకుందని చెప్పారు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పీఠం టీడీపీకి దక్కుతుందని అన్నారు.

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

చాగలమర్రి, జూన్ 27: చాగలమర్రి గ్రామానికి చెందిన ఎం.అబ్దుల్ మునాఫ్ (25) అనే యువకుడు ఈనెల 16న తన నివాసంలో ఉరి వేసుకొని కనిపించాడు. యువకుడు మృతి చెందిన రోజు ఎలాంటి కేసు నమోదు కాలేదు. తన భర్త మృతిపై అనుమానాలు భార్య రిజ్వాన ఆలస్యంగా ఫిర్యాదు చేశారని ఎస్ఐ రమణయ్య తెలిపారు. చాగలమర్రి తహసీల్దార్ వెంకటరమణమ్మ వీఆర్వోలు, నంద్యాలకు చెందిన వైద్యుల సమక్షంలో స్థానిక అరబ్ మసీదు వెనుక భాగంలో ఉన్న స్మశాన వాటికలో ఖననం చేసిన మునాఫ్ మృతదేహాన్ని వెలికి తీసి వైద్య బృందంతో పోస్టుమార్టం నిర్వహించామని ఎస్ఐ తెలిపారు. యువకుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి


బనగానపల్లె ప్రభుత్వ కళాశాల సమస్యలపై మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది

బనగానపల్లె , జూన్ 27: ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులకు సూచించారు. రోడ్లు, భవనాల శాఖామంత్రిగా పదవీబాధ్యతలు స్వీకరించిన బీసీ తొలిసారి బనగానపల్లెకు రావడంతో గురువారం బిజీబిజీగా గడిపారు. జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, బనగానపల్లె నియోజవకర్గంలోని అన్ని మండలాలకు చెందిన వివిధ శాఖలకు చెందిన అధికారులు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్సార్బీసీ, ఆర్‌అండ్‌బీ, వెలుగు, ఎంపీడీవో, పంచాయితీరాజ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ తదితర శాఖలకు చెందిన సిబ్బంది అధికారులు, మంత్రిని కలిసి అభినందనలు తెలిపారు. అలాగే నియోజవకర్గంలోని పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు బీసీని కలిశారు. పలువురు తమ సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. వాటిని అక్కడికక్కడే పరిష్కరించేలా మంత్రి చర్యలు తీసుకున్నారు. సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కరించాలని మంత్రి బీసీ ఆదేశించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది మంత్రి బీసీని కలుసుకొని సమస్యలను విన్నవించారు. కళాశాలలో జరుగుతున్న నాడు- నేడు పనులకు సంబంధించి వివరాలను మంత్రికి తెలియజేశారు. కళాశాల సమస్యలను మంత్రి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కళాశాలలో మంచినీటి సమస్యను మంత్రి దృష్టికి తేగా త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరక్టర్ శ్రీధర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా బీసీని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గంలోని ఏపీఎంలు, కమ్యూనిటీ కోఆర్డినేటర్‌లు, కలసి మంత్రికి శుభాకాంక్షలు తెలియజేశారు.

త్వరలో అందరినీ కలుస్తా

త్వరలో నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో అన్నిశాఖల అధికారులతో, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామనని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి గురువారం తెలిపారు. బనగానపల్లె టీడీపీ కార్యాలయానికి నిత్యం వందలాదిగా తరలివస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, ప్రజల అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. సమయాభావం వల్ల ప్రతి ఒక్కరిని కలువలేకపోతున్నట్లు తెలిపారు. నియోజకవర్గ సమస్యలపై ప్రత్యేక సమీక్షా సమావేశాలు మండల కేంద్రాల్లో అధికారులు, టీడీపీ నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 30న కోవెలకుంట్లలో, జూలై 2న సంజామలలో, జూలై 3న కొలిమిగుండ్లలో, జూలై 4న బనగానపల్లెలో, జూలై 5నఅవుకులో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని మంత్రి కోరారు.

'చిరుత పులి కోసం గాలింపు'

శిరివెళ్ల, జూన్ 27: నల్లమల అటవీ ప్రాంతంలో పచ్చర్ల సమీపంలో పర్యటిస్తున్న చిరుత పులి ఆనవాళ్ల కోసం అటవీ శాఖ సిబ్బంది బృందాలుగా పర్యటిస్తున్నట్లు ఎఫ్‌ఆర్‌వో ఈశ్వరయ్య గురువారం తెలిపారు. దొరబావి బీట్, పచ్చర్ల బీట్‌లలో అదనపు బోన్లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. చిరుత పులి సంచరిస్తుందన్న అనుమానం ఉన్న ప్రాంతాల్లో ట్రాప్ కెమెరాలు, బోన్లను అమర్చినట్లు తెలిపారు. పచ్చర్ల గ్రామ ప్రజలు ఒంటరిగా అటవీ ప్రాంతంలోకి వెళ్లకూడదని, ప్రజలు గుంపులుగా పర్యటించాలని ఆయన సూచించారు. చిరుత బోనుకు చిక్కేంత వరకు పచ్చర్ల గ్రామస్థులు అటవీ ఉత్పత్తుల కోసం అడవిలోకి వెళ్లకూడదని, ఇళ్ల వద్ద సైతం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎఫ్‌ఆర్‌వో సూచించారు.

'అనుమతి లేకుండా అడవిలోకి ప్రవేశించకూడదు'

రుద్రవరం, జూన్ 27: అనుమతిలేనిదే అడవిలోకి ప్రవేశించకూడదని రేంజర్ శ్రీపతినాయుడు గురువారం అన్నారు. స్థానిక ఫారెస్టు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చిరుతపులులు పెద్దపులుల సంచారం ఉందని, అటవీ ప్రాంత తీర ప్రజలు ఎప్పటికప్పుడు వన్యప్రాణులు సంచరించినట్లయితే సమాచారం అందించాలని చెప్పారు. అటవీ సిబ్బంది అప్రమత్తంగా ఉండి గస్తీ నిర్వహించాలన్నారు. రుద్రవరం రేంజ్‌లోని రుద్రవరం, నూతల, ఆలమూరు, అహోబిళం సెక్షన్ల పరిధిలో గ్రామాల్లోని ప్రజలను అప్రమత్తం చేసినట్లు తెలిపారు.

'గ్రామాల్లో టాంటాం వేయించాం'

రుద్రవరం, జూన్ 27: మండలంలోని కోటకొండ, శ్రీరంగాపురం గ్రామాల్లో టాంటాం వేయించినట్లు తహసీల్దారు మురళీమోహన్ గురువారం తెలిపారు. అటవీ తీరంలో చిరుతపులుల సంచారం ఉందని, ఒంటరిగా అటవీ ప్రాంతంలో సంచరించకూడదని సూచించామని చెప్పారు. ఏదైనా వన్యప్రాణి సంచరించినట్లయితే తమకు సమాచారం అందించాలని సూచించారు.

వంక ఆక్రమణపై ఫిర్యాదు

ప్యాపిలి, జూన్ 27: మండలంలోని పెద్దపాయి గ్రామంలో పొలాలకు వెళ్లే రహదారి ప్రక్కన ఉన్న వంక పోరంబోకు భూమిని కొంతమంది ఆక్రమించుకున్నారని ఆదే గ్రామానికి చెందిన రైతు యాగంటిరెడ్డి గురువారం తహసీల్దారు ప్రతాప్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. వంకను ఆక్రమించుకోవడం వలన రహదారి కుదించుకపోయిందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనివల్ల ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు వెళ్లాలంటే ఇబ్బందిగా మారిందన్నారు. దీంతో స్పందించిన తహసీల్దారు సర్వే చేసి న్యాయం చేస్తామని రైతుకు హామీ ఇచ్చారు.

వైభవంగా అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం


స్వామివారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బేతంచెర్ల, జూన్ 27: పట్టణ శివారులోని నంద్యాల రహదారిలో వెలసిన అయ్యప్పస్వామి దేవాలయ 10వ వార్షికోత్సవం అయ్యప్పస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు స్వామివారికి పంచామృతాభిషేకం, 8 గంటలకు గణపతి పూజ పుణ్యాహావచనం, రక్షబంధనం, రుద్రీకరణం, కలశ స్థాపన, స్వామివారికి అలంకరణ, అర్చన 10 గంటలకు గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, నవగ్రహ, అయ్యప్ప, మాలిక పురోత్తమ దేవికి మూలమంత్ర హోమం కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో ఏర్పాటు చేసి దేవాలయం నుంచి స్వామివారికి గ్రామోత్సవం ఊరేగించారు.

● మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి స్వామి, మహాలక్ష్మి అమ్మవారి వార్షిక మహోత్సవం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు వివిధ ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని పల్లకిలో ఊరేగించారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ ఆలయ ఈవో రామాంజనేయులు, ఆలయ వేద పండితులు అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలలను బలోపేతం చేద్దాం

జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకరరెడ్డి


విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 27: నంద్యాల జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకరరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఐఈ జిల్లా కోఆర్డినేటర్ రఘురామిరెడ్డితో కలిసి ఆయన కొలిమిగుండ్ల మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా కొలిమిగుండ్ల మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీలతో పాటు పలు పాఠశాలలను ఆయన సందర్శించారు. మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాగా మోడల్ స్కూల్‌లో పలువురు విద్యార్థులు ఇంటి నుంచి భోజనం క్యారియర్ తెచ్చుకొని తింటున్నట్లు గమనించి కూడా డీఈవో పట్టించుకోకపోవడం గమనార్హం. అనంతరం విలేకరులతో మాట్లాడిన డీఈవో సుధాకరరెడ్డి రాష్ట్ర మంత్రి బీసీ జనార్దనరెడ్డి సహకారంతో జిల్లాలో విద్యాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. విద్యాపరంగా వెనుబడిన కొలిమిగుండ్ల మండలంపై ప్రత్యేక శ్రద్ధపెట్టి, మంత్రి సహకారంతో ముందుకు తీసుకవెళతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో అబ్దుల్‌కలాం, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లను పెంచాలి : డీఈవో

అవుకు, జూన్ 27 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్‌లు పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం అలెస్కో కో ఆర్డినేటర్ రఘురామిరెడ్డి, ఎంఈవోలు శ్రీధర్‌రావు, వెంకటేశ్వరరెడ్డితో కలసి డీఈవో అవుకు పట్టణంలోని జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు, కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. పాఠశాలల గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. స్టూడెంట్ కిట్స్ స్టాక్‌ను పరిశీలించి, విద్యార్థులకు పంపిణీ చేసిన రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శింగయ్య, చెన్నకేశ్వరి, కేజీబీవీ ఎస్ఓ భవాని పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బనగానపల్లె , జూన్ 27: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని టంగుటూరు వైద్యాధికారి డాక్టర్ శివశంకరుడు అన్నారు. గురువారం బనగానపల్లె పట్టణంలోని రాంభూపాల్‌నగర్‌లోని 16వ వార్డులో ఉన్న 18-60 సంవత్సరాల వయస్సు గల వారికి క్షయవ్యాధి, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు, టీబీ మందులు వాడే వారికి షుగర్ వ్యాధి గ్రస్తులకు వ్యాక్సినేషన్ కార్యక్రమంనిర్వహించారు. అలాగే పట్టణంలోని రవ్వలకొండలోని ఏపీ మోడల్ బాలికల పాఠశాల, బీసీ బాలుర హాస్టల్, బీసీ గురుకుల బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వెంకటేశ్వర్లు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు రమేశ్, ఆరోగ్య కార్యకర్త, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

బేతంచెర్ల, జూన్ 27: గ్రామీణ ప్రాంతాల్లోని గ్రామాలు, పట్టణంలో ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా, డెంగ్యూ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు, సహాయ మలేరియా అధికారి వరప్రసాద్ రెడ్డిలు ప్రజలకు సూచించారు. పట్టణంలోని మలేరియా వ్యతిరేక దినం పురస్కరించుకుని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు, సహాయ మలేరియా అధికారి వరప్రసాద్‌రెడ్డి అధికారుల పర్యవేక్షణలో పట్టణంలోని వడ్డెగేరి, బోయపేట, చాకలిపేటలను సందర్శించి ఇంటి పరిసరాలను, నీటి తొట్లను పరిశీలించారు. దోమతెరలు వాడండి దోమకాటు నుంచి రక్షణ పొందండి వంటి సలహాలను ప్రజలకు వివరించారు. అనంతరం నగర పాలక కమిషనర్ రమేష్‌బాబును సంప్రదించి కమిషనర్‌కు పట్టణంలోని వీధి కాలువలను ప్రతిరోజు శుభ్రపరచాలని, పిచికారి చేయించాలని దోమల పొగ ఫాగింగ్ చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం డా.వైబీ ప్రియాంక, మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, వైద్యసిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

'ఇంటి వద్దకే పింఛన్'

ఉయ్యాలవాడ, జూన్ 27: మండలంలోని అన్ని గ్రామాల్లో జూలై ఒకటవ తేదీన ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తామని ఎంపీడీవో రఘురామ్ తెలిపారు. గురువారం ఆయరన మాట్లాడుతూ మండలంలో 3,925 పింఛన్లు ఉన్నాయని చెప్పారు. పింఛన్ల పంపిణీ సచివాలయ ఉద్యోగుల ద్వారా అందిస్తామని ఆయన తెలిపారు.

రామిరెడ్డిపల్లె సర్పంచ్‌గా మంచాల వీరప్రతాప్ రెడ్డి



సంజామల, జూన్ 27: రామిరెడ్డి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా మంచాల వీరప్రతాప్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గత ఎన్నికలల్లో సర్పంచ్‌గా గెలుపొందిన ఎమ్ సోమసుందర్ రెడ్డికి ఆరోగ్యం సహకరించకపోవడంతో సెలవు కోరుతూ వైద్య ధృవీకరణ పత్రాలను జిల్లా గ్రామ పంచాయతీ అధికారికి సమర్పించారు. దీంతో ఉప సర్పంచ్‌గా ఉన్న వీరభద్రరెడ్డి సర్పంచ్ అధికారిగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ప్రతాప్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. పంచాయితీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు.

మద్దిలేటి స్వామి హుండీల ఆదాయం రూ.24.42 లక్షలు

బేతంచెర్ల, జూన్ 27: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి స్వామి హుండీల ఆదాయం రూ.24.42 లక్షలు వచ్చినట్లు ఉప కమిషనర్ ఆలయ కార్యనిర్వహణాధికారి రామాంజనేయులు గురువారం తెలిపారు. మద్దిలేటి స్వామి, మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో ఉన్న నెల రోజులకు సంబంధించిన హుండీ లెక్కింపును ఈవో సమక్షంలో లెక్కింపు నిర్వహించారు. మద్దిలేటి స్వామి హుండీలలో లెక్కింపు రూ.21,40,514లు, బంగారు 36 గ్రాములు, వెండి 4.10 గ్రాములు సమకూరినట్లు తెలిపారు. మహాలక్ష్మి అమ్మవారి హుండీల లెక్కింపు ఆదాయం రూ.3,01,487 రాగా వెరసి మొత్తం రూ.24,42,001 వచ్చినట్లు ఉప కమిషనర్ ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు.

రికార్డుల తనిఖీ

రుద్రవరం, జూన్ 27: మండలంలోని నరసాపురం, తిప్పారెడ్డిపల్లె ఆరోగ్య కేంద్రాలను ఆరోగ్యశాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ గురువారం తనిఖీ చేసినట్లు వైద్యాధికారి బాబు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రిజిస్టర్లను పరిశీలించారు. బాల బాలికలను ప్రత్యక్షంగా పరోక్షంగా పరీక్షలు నిర్వహించి రికార్డులు నమోదు చేయాలని ఆదేశించారు. రికార్డులను జిల్లా వైద్యఆరోగ్యశాఖ గణాంకాధికారి సుజాత, శివకుమార్, లావణ్య పరిశీలించారన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

ఎమ్మెల్యే కోట్ల చొరవతో రూ.98 లక్షలు మంజూరు

● మారనున్న ఆటోనగర్ రూపురేఖలు


ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని కలిసి అభినందనలు తెలుపుతున్న ఆటోనగర్ టీడీపీ నాయకులు

డోన్, జూన్ 27: డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి చొరవతో మౌలిక వసతుల కోసం రూ.98 లక్షల నిధులు మంజూరయ్యాయి. దీంతో పట్టణంలోని ఆటోనగర్ రూపురేఖలు మారనున్నాయి. ఇటీవల ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పట్టణంలోని ఆటోనగర్‌లో పర్యటించారు. రహదారులు, డ్రైనేజీ కాలువల సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్నట్లు కాలనీ టీడీపీ నాయకులు, ప్రజలు ఎమ్మెల్యే కోట్ల దృష్టికి తీసుకువచ్చారు. అంతేగాక ఎమ్మెల్యే కోట్ల తన పర్యటనలో అధ్వాన్న రహదారులను చూసి మున్సిపల్ అధికారులకు నిధులు మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే కోట్ల ప్రత్యేక చొరవతో రెండు రోజుల క్రితం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆటోనగర్ అభివృద్ధి కోసం రూ.98 లక్షల నిధులు కేటాయించారు. ఆటోనగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తూ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వార్డు పర్యటనలో స్వయంగా కాలనీ దుస్థితిని చూసిన ఎమ్మెల్యే కోట్ల చొరవ తీసుకుని ఆటోనగర్ అభివృద్ధికి నిధులు మంజూరుకు కృషి చేశారు. గురువారం పట్టణంలోని కోట్ల నివాసంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్, ఆటోనగర్ టీడీపీ నాయకులు టైలర్ ఖాజా, లారీల బాషా, ధర్మవరం ఈశ్వరయ్య ఎమ్మెల్యే కోట్లను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆటోనగర్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

విత్తనాలు అధిక రేట్లకు విక్రయిస్తే చర్యలు తప్పవు


రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

కోవెలకుంట్ల, జూన్ 27 : మండలంలోని విత్తనాల షాపులో డీలర్లు విత్తనాలు అధిక రేట్లకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. గురువారం పట్టణంలోని వివిధ ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత రైతులు రశీదులు తీసుకోవాలని అన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శబరికి అభినందనలు

కోవెలకుంట్ల, జూన్ 27 : టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరిని ఎంపిక చేయడం హర్షించదగ్గ విషయమని టీడీపీ రాష్ట్రకార్యదర్శి గడ్డం రామక్రిష్ణరెడ్డి అన్నారు. గురువారం ఆయన సీఎం చంద్రబాబుకు, బైరెడ్డి శబరికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

కత్తెర పురుగు నివారణపై అవగాహన


చిత్తరేణిపల్లెలో నారుమళ్లను పరిశీలిస్తున్న ఏవో శ్రీకృష్ణ

చాగలమర్రి, జూన్ 27: మండలంలోని పెద్దవంగలి గ్రామంలో మొక్కజొన్న పంట సాగు చేసిన రైతులకు కత్తెర పురుగు నివారణపై ఏవో రంగనేతాజీ గురువారం అవగాహన కల్పించారు. రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. అధిక కలుపు మొక్కల యాజమాన్యం, తెగుళ్ల నివారణ గురించి రైతులకు వివరించారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. పీఎం కిసాన్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు ఉన్నారు.

'వరి నారుమళ్ల సాగులో మెలకువలు పాటించాలి'

రుద్రవరం, జూన్ 27: వరి నారుమళ్ల సాగులో మెళకువలు పాటించాలని ఏవో శ్రీకృష్ణ సూచించారు. మండలంలోని చిత్తరేణిపల్లె, సుగాలితాండ గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించి రైతులకు నూతన వ్యవసాయంలో మెళకువల గురించి వివరించారు. వరినారు మడిలో విత్తనశుద్ధి తప్పనిసరి, తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవడానికి నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. కేజీ విత్తనానికి 10 గ్రాములు సూడోమోనాస్ కలిపి విత్తనశుద్ధి చేయాలన్నారు. లీటరు నీటికి పది గ్రాములు పిచికారీ చేయాలన్నారు. నారుమడిలో ఉల్లికోడు, కాండం తొలుచు పురుగు నివారణ కోసం కార్బోఫిరాన్ గుళికలు 15 రోజుల వయసు గల నారుమడిలో రెండు సెంట్ల నారుమడికి 160 గ్రాముల చొప్పున చల్లాలన్నారు. 25 రోజుల నారుమడికి 120 గ్రాములు చల్లాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో రాజు, వీఏఏ పవిత్ర, రంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

'మాతా శిశు సంరక్షణకు కృషి'


శిరివెళ్లలో అవగాహన కల్పిస్తున్న ప్రోగ్రాం అధికారి కీర్తి

శిరివెళ్ల, జూన్ 27: మాతా శిశు సంరక్షణకు కృషి చేస్తున్నట్లు కిల్కారి రీజనల్ ప్రోగ్రాం ఆఫీసర్ కీర్తి అన్నారు. శిరివెళ్ల పీహెచ్‌సీలో కిల్కారి కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవల పనితీరును ఆమె గురువారం పరిశీలించారు. సురక్షిత ప్రసవం, ముర్రుపాల ఆవశ్యకత, శిశువులకు అందించే టీకాలు తదితర వాటి గురించి వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. మాతా శిశు మరణాలను గణనీయంగా తగ్గించడమే ధ్యేయంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఆశా నోడల్ అధికారి వీరన్న, శిరివెళ్ల పీహెచ్‌సీ వైద్యులు దివ్య, ముఖేష్, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి, పీహెచ్ఎన్ సరస్వతి, అమినాబీ, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థినుల ప్రతిభ

రుద్రవరం, జూన్ 27: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో రుద్రవరం ఆదర్శ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు గురువారం తెలిపారు. సీఈసీలో సంధ్యకు 500కు గాను 469, దేవికి 448, ఎంపీసీలో పావనికి 470 మార్కులకు 440, మంజులకు 420, బైపీసీలో 440 మార్కులకు గాను ప్రసన్నకు 410, షబినాకు 410 మార్కులు వచ్చాయని తెలిపారు. విద్యార్థినులను అభినందించారు.

మినరల్ వాటర్ ప్లాంట్లలో నిబంధనలు పాటించాలి

డోన్, జూన్ 27: డోన్ మున్సిపాలిటీ పరిధిలోని మినరల్ వాటర్ ప్లాంట్లలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ డా.జయరాం ఆదేశించారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మినరల్ వాటర్ ప్లాంట్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ వాటర్ ప్లాంట్లలో నిబంధనల ప్రకారం శుద్ధి చేయకుండా మినరల్ వాటర్ అందిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం వాటర్ ప్లాంట్లలో శుద్ధజలం తయారు చేసి అందించాలన్నారు. వాటర్ ప్లాంట్ల యజమానులందరి దగ్గర క్లీనికల్ ల్యాబ్ రిపోర్టు తప్పనిసరిగా ఉండాలన్నారు. అదే విధంగా వర్షాకాలంలో డయేరియా అంటువ్యాధి ప్రబలుతుండటంతో పట్టణంలో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకుంటున్నామమి కమిషనర్ జయరాం తెలిపారు. సమావేశంలో మున్సిపల్ డీఈ రసూల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు సచివాలయాల శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

కారు- ట్రాక్టర్ ఢీ..

బేతంచెర్ల, జూన్ 27: బేతంచెర్ల-కర్నూలు రహదారిలోని అయ్యలచెరువు ప్రాంతంలో ఎదురెదురుగా వస్తున్న కారు, నాపరాళ్ల ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు డ్రైవర్లు సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. ఈ సంఘటన గురువారం జరిగింది. బేతంచెర్లకు చెందిన ట్రాక్టర్ పలుకూరు నాపరాళ్ల గనుల నుంచి లోడుతో ఫ్యాక్టరీకి వెళ్తుండగా.. కర్నూలు నుంచి బేతంచెర్ల వైపు వస్తున్న కారు వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం తీవ్రంగా దెబ్బతిన్నది. కారు, ట్రాక్టర్ల డ్రైవర్లు సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు.